విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :122 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 20 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన



- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్
- రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు శ్రీకారం
- మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ
- తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన

అమరావతి

ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా సోమవారం,

వివరాలు 2లో..

## యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం.. నగదు మాత్రమే!

- తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోం
- నగదు మాత్రమే తీసుకుంటాం
- రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే




## బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం



- 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు'
- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ
- 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ
- దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా

# నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్రంలోని 513 మండలాల్లో కరవు
- అధికారుల ప్రాథమిక అంచనా
- వర్షాభావ పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఎక్కడా పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు
- సూక్ష్మ సేద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలిచ్చారు.
- పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి



అమరావతి


ఏపీలో 513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి హై అలర్ట్ ప్రకటించారు. రైతు పంటకు భరోసా, ప్రజలకు నీటి భద్రతే లక్ష్యంగా సీఎం ముందస్తు యాక్షన్ ప్లాన్‌కు దిశానిర్దేశం చేశారు. వర్షాభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి అక్టోబర్ 1న కరవు మండలాలను ప్రకటించాలని ఆదేశించారు. పంట నష్టం రాకుండా ఇప్పటి నుంచే చర్యలు మొదలు పెట్టాలని, సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని తాగునీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు అమరావతిలోని ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు రాష్ట్రంలో నెలకొన్న కరవు ముప్పుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీ వ్యాప్తంగా కరవు ప్రభావాన్ని ఎప్పటికప్పుడు

వివరాలు 2లో..



## దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీ

- విద్యార్థులు ప్రశ్నించడం ఆ సిస్టమ్‌కు ఇష్టం లేదు
- ఆ ఆరుగురే వ్యవస్థను నడిపిస్తున్నారు
- ఛాత్రోం కీ గూంజ్ ప్రచారంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- దేశమంతా ఒక వ్యవస్థ చేతిలో బందీగా ఉందని ఆరోపణలు
- విద్యార్థులు ప్రశ్నిస్తున్నందుకు ఆ సిస్టమ్ వారిని భయపెడుతోందన్న కాంగ్రెస్ నేత



## 20ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది

- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డోభాల్
- దేశం అద్భుతమైన భవిష్యత్తు వైపు అడుగులేస్తోందని వెల్లడి
- 2047 వరకు ఉన్న సమయం నిజమైన 'అమృత కాలం' అని వ్యాఖ్య



## నైరుతి రుతుపవనాల తిరోగమనం షురూ

- ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం!
- దేశాన్ని వీడుతున్న నైరుతి రుతుపవనాలు
- సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి తిరోగమనం ప్రారంభం
- ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఐఎండీ ప్రకటన

# త్వరలో విశ్వనగరంగా విశాఖ




- 28,445 కుటుంబాలకు యాజమాన్య హక్కులు
- లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్‌లను పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- విశాఖలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న 28వేలకుపైగా పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలు
- దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరం విశాఖ

విశాఖపట్నం

కూడు, గూడు, గుడ్డ అనే ఎన్టీఆర్ నినాదాన్నే తాము విధానంగా మార్చుకుని పేదలందరికీ నివాస వసతి కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న 28 వేలకుపైగా పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను చంద్రబాబు అందించారు. లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందించి సుభాకాంక్షలు తెలియజేశారు. వేల మంది ప్రజలకు ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తున్న ఈరోజు తన జీవితంలో మర్చిపోనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నా జీవితం ధన్యమైంది, లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూస్తున్నా. 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. మీరు ఉండే ఇళ్లపై సర్వహక్కులు ఇకనుంచి మీవే. పేదలకు పట్టాభిషేకం

వివరాలు 2లో..



## టీఎంసీ పేరు, గుర్తు వివాదం.. ఈసీ నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమత

- బెంగాల్ ఉపఎన్నికల్లో టీఎంసీ పేరు, గుర్తు వాడొద్దన్న ఈసీ
- ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ పిటిషన్
- పార్టీ గుర్తింపు కోల్పోవడం బాధాకరం

## స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం..



- 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం
- ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనేది ముఖ్యం కాదన్న మనోహర్
- కచ్చితంగా విజయం సాధించే స్థానాల్లో పోటీ చేయడమే ముఖ్యమని వ్యాఖ్య
- పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నారని వెల్లడి

## పులివెందులలో మారుతోన్న సీన్

**కడప :** పులివెందుల అంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని కోట. అక్కడ ఏ గొడవలు జరిగినా, రాజకీయ ఘర్షణలు చోటుచేసుకున్నా అది కేవలం వైసీపీలోని అంతర్గత వర్గాల మధ్యనే సాగేది. ప్రత్యర్థి పార్టీల ఉనికి నామమాత్రంగానే ఉండటంతో, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చెప్పిందే వేదంగా చెల్లుబాటు అయ్యేది. అయితే 2024 ఎన్నికల ఓటమి తర్వాత పులివెందులలో సీన్ పూర్తిగా మారిపోయింది. దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యం చలాయించిన వైసీపీ నాయకులు ఇప్పుడు సైలెంట్ కావడం, చాలామంది దారి చూసుకోవడం లేదా పక్కకు తప్పుకోవడంతో అక్కడ వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో అడుగంటిపోతోంది.వైసీపీ ఓటమితో ఉత్పన్నమైన ఖాళీని భర్తీ చేస్తూ పులివెందులలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీయే ప్రధాన శక్తిగా అవతరించింది. అయితే, పార్టీ బలోపేతమవుతున్న కొద్దీ స్థానిక నేతల మధ్య ఆధిపత్య పోరు పెరుగుతోంది. టీడీపీలోని వేర్వేరు వర్గాలు నియోజకవర్గంలో తమ పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. గణేష్ మండపం వద్ద జరిగిన వివాదం, తదనంతరం సాగిన కాల్పుల కలకలం, వాహనాల ధ్వంసం ఘటనలు కూడా టీడీపీలోని ఆధిపత్య రాజకీయాలకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచాయి.పుష్పనాథ్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి వర్గాల మధ్య సన్మానం వివాదంతో మొదలైన రచ్చ చివరకు గాల్లోకి తూటాలు పేలే వరకు వెళ్లాయి. పులివెందులలో తిరుగులేదని భావించిన వైసీపీ నేతలు ఈ గొడవలన్నింటినీ చూస్తూ మౌనం వహించడమే ఆ పార్టీ ప్రస్తుత దుస్థితికి అద్దం పడుతోంది.

## స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఈరోజు పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్థానిక వార్డుల వారీగా బలమైన నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనే సంఖ్య కంటే, గెలిచే బలం ఉన్న స్థానాల్లో నిలబడి కచ్చితమైన విజయం సాధించడమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాళ్టి నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నారని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాజకీయాల్లో అనుభవమే అసలైన పాఠమని పేర్కొంటూ, జీవీఎంసీ పరిధిలో గతంలో గెలిచిన, రెండో స్థానంలో నిలిచిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేవలం టికెట్ వస్తే సరిపోదని... ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేడర్ నిరంతరం శ్రమించాలని నిర్దేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత వల్లే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కొండంత భరోసా లభించిందని, ఉత్తరాంధ్రకు వస్తున్న భారీ ప్రాజెక్టులే దీనికి నిదర్శనమని చెప్పారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందని తెలిపారు.

# జగన్ మైండ్ గేమ్ స్టార్ట్...



**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న పిలుపులు, వేస్తున్న పావులు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆయన సాగిస్తున్న సుదీర్ఘ పోరాటంలో.. అనూహ్యంగా అధికార కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీలను లక్ష్యంగా చేసుకోవడం పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ప్రభుత్వం ఎన్ని రకాల వివరణలు ఇచ్చినా, గణాంకాలు ముందుంచినా డీఎస్సీపై తన ఆరోపణలకే కట్టుబడి ఉన్న జగన్.. ఈ క్రమంలో టీడీపీతో సాగుతున్న కూటమి నుంచి బీజేపీ, జనసేన తక్షణమే బయటకు రావాలి అని డిమాండ్ చేయడం వెనుక ఎలాంటి వ్యూహం ఉందనేది ఆసక్తికరంగా మారింది.గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ పెద్దలతో జగన్‌కు ఉన్న సాన్నిహిత్యం బహిరంగ రహస్యమే. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కానీ, ప్రతిపక్షంలోకి వచ్చాక కానీ ఆయన కేంద్ర ప్రభుత్వంపై లేదా ప్రధాని మోదీపై నేరుగా విమర్శలు చేసిన దాఖలాలు లేవు. అలాంటి జగన్, ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి నుంచి బీజేపీ, జనసేన వైదొలగాలని గొంతు ఎత్తడం వెనుక ప్రధానంగా కూటమి ఐక్యతను దెబ్బతీసే పెద్ద వ్యూహం దాగి ఉందనేది పొలిటికల్ ఎనలిస్ట్‌ల ప్రాథమిక అంచనా. 2024 ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేయడం వల్లే వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు లేదా భవిష్యత్ సమరాల నాటికి ఈ బంధంలో చీలికలు తెస్తే తప్ప, రాజకీయంగా కోలుకోవడం కష్టమనే ఆలోచనతోనే జగన్ ఈ డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారని భావించవచ్చు.డీఎస్సీ వివాదాన్ని కేవలం విద్యాశాఖ , టీడీపీ ప్రభుత్వ వైఫల్యంగా మాత్రమే కాకుండా, మొత్తం కూటమి ప్రభుత్వ నైతిక వైఫల్యంగా చిత్రించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని మండిపడుతున్న ఆయన, ఈ పాపంలో బీజేపీ, జనసేనలు కూడా భాగస్వాములు కాకూడదంటే వెంటనే బయటకు రావాలని నైతిక ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి భాగస్వామ్య పక్షాల్లో అంతర్గత అనుమానాలను, విభేదాలను రేకెత్తించడం ద్వారా టీడీపీని ఒంటరిని చేయాలనేది జగన్ వ్యూహంలో భాగం. ఇటీవల కాక్రోచ్ కామెంట్స్, పోరాట వ్యూహాలపై జగన్ మాట్లాడిన తీరును చూస్తే.. ఇది కేవలం కూటమిని విచ్ఛిన్నం చేసే వ్యూహమే కాకుండా, రాబోయే రోజుల్లో కేంద్రంలోని బీజేపీపై కూడా పూర్తిస్థాయిలో వ్యతిరేక గళం విప్పడానికి ఇస్తున్న ముందస్తు సంకేతామా అనే కోణంలోనూ విశ్లేషణలు సాగుతున్నాయి. ఇన్నాళ్లూ కేంద్రంతో మైత్రిని కొనసాగించినా తమకు దక్కిన రాజకీయ ప్రయోజనం ఏమీ లేదని, ప్రతిపక్షంగా నిలదొక్కుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒకేసారి విరుచుకుపడటమే ఏకైక మార్గమని వైఎస్ఆర్‌సీపీ భావిస్తూ ఉండవచ్చు.ఈ విమర్శలు ఫలిస్తాయా అంటే ఆచరణలో అది సాధ్యపడేలా కనిపించడం లేదు. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన, కేంద్రంలోని బీజేపీ నాయ కత్వం టీడీపీతో అత్యంత బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తున్నాయి. జగన్ చేస్తున్న ఈ డిమాండ్లను కూటమి నేతలు తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు. తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, క్యాడర్‌లో ఉత్సాహం నింపడానికి జగన్ ఆడుతున్న మైండ్ గేమ్ ఇది తప్ప, దీనివల్ల కూటమి విచ్ఛిన్నమయ్యే అవకాశం శూన్యమని అధికార పక్షం కౌంటర్ ఇస్తోంది. డీఎస్సీ అక్రమాల నెపంతో కూటమి పునాదులను కదిలించేందుకు జగన్ చేస్తున్న ఈ ప్రయత్నం ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తుందో లేక కేవలం ఒక రాజకీయ ప్రకటనగానే మిగిలిపోతుందో వేచి చూడాలి.

# రచ్చకెక్కిన వైసీపీ పాలిటిక్స్

**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తనయుడు చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీలో తీవ్ర కలకలం రేపాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్ సొంత పార్టీ నాయకులపై సంచలన వ్యాఖ్యలు చేయడం శ్రీకాకుళం జిల్లా వైసీపీ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. తమ్మినేని సీతారాం రాజకీయ జీవితానికి ముగింపు ఉండదని, కేవలం విరామాలు మాత్రమే ఉంటాయని వ్యాఖ్యానించిన ఆయన, జిల్లా పార్టీ అధ్యక్షుడి పనితీరుపై నిప్పులు చెరిగారు.మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ తమ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఖండించకపోవడం దారుణమని మండిపడ్డారు. తమ్మినేని సీతారాంకు, టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మధ్య రహస్య రాజకీయ ఒప్పందం ఉందంటూ వైసీపీ నేతలే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ధర్మాన సోదరులు, కుంభ రవిబాబు, భూడి ముత్యాల నాయుడు వంటి ముఖ్య నేతలు స్పందించకపోవడం దారుణమన్నారు. సీతారాం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఏనాడూ వివక్ష చూపలేదని, కానీ ఇప్పుడు జిల్లాలో ఒకే కులం ప్రాబల్యాన్ని పెంచేలా పార్టీ సాగుతోందనే చర్చ జరుగుతోందన్నారు. ఆమదాలవలస ఇన్చార్జ్ చింతాడ రవి అభ్యర్థిత్వంపై నాయకుల్లో అభద్రత ఉందని పేర్కొన్నారు.వచ్చే ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాదని, కావాలంటే పార్టీ సర్వే నివేదికలను పరిశీలించుకోవచ్చని సైతం సంచలన వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో పార్టీ సీనియర్ నాయకుల తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ వైఖరితో పార్టీకి ఏ ప్రయోజనం లేదన్నారు.ఆమదాలవలసలోని తమ నివాసంలో మీడియాతో మాట్లాడిన చిరంజీవి నాగ్.. శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్ వైఖరి సరిగ్గా లేదని విమర్శించారు. పార్టీకి పెద్దదిక్కుగా చెప్పుకొనే ధర్మాన ప్రసాదరావు తీవ్ర అభద్రతాభావంతో రాజకీయాలు చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా పరిశీలకుడు బూడి ముత్యాలనాయుడి బాధ్యతలపై ప్రశ్నిస్తూ, స్థానిక ఎన్నికల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను వేదికపై ఉన్న సీనియర్ నాయకులు ఎవరూ ఖండించకపోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. సెప్టెంబర్ 12న త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించింది. చింతాడ రవి అరెస్టును రాజకీయ పరిణామంగా అభివర్ణించి, తమ్మినేని సీతారాం అరెస్టు కాకపోవడానికి బంధుత్వాలే కారణమని గొర్లె కిరణ్ మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు. జిల్లా పరిశీలకుడు బూడి ముత్యాలనాయుడు, పార్లమెంట్ పార్టీ పరిశీలకులు అయిన కుంబ రవి, సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావులు గొర్లె కిరణ్ కుమార్ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు.పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించడంలో ధర్మాన కృష్ణదాస్ విఫలమయ్యారని, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలను అడ్డుకోలేకపోయారని విమర్శించారు. కేవలం ఒక కులాన్ని ఆధారంగా చేసుకుని రాజకీయాలు చేయాలనుకుంటే ఆ విషయాన్ని నేరుగా పార్టీ అధిష్ఠానానికి స్పష్టం చేయాలని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాల్లో వైసీపీ ఒక్క సీటూ గెలవదని తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి.

# ఆర్థిక రాజధానిగా విశాఖ

**విశాఖపట్టణం :** విశాఖపట్నం భవిష్యత్‌లో మరింత వేగంగా విస్తరించే అవకాశాలున్న నగరంగా మారుతోంది. ఐటీ రంగం, డేటా సెంటర్లు (, పరిశ్రమలు, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ నగరానికి వచ్చే ప్రజల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఉపాధి అవకాశాలు పెరిగి ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు నగరానికి వచ్చే పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో రాబోయే సంవత్సరాల్లో విశాఖ జనాభా గణనీయంగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి.జనాభా పెరుగుదలతో పాటు నగర మౌలిక సదుపాయాలను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యంగా రవాణా, విద్యుత్, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు సరిపడా నీటి లభ్యత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో భవిష్యత్ అవసరాలను తీర్చడం కష్టమయ్యే అవకాశం ఉన్నందున ముందుగానే దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ఈ విషయంలో సింగపూర్ ) అనుసరిస్తున్న నీటి నిర్వహణ విధానాలను ఉదాహరణగా తీసుకోవచ్చనే అభిప్రాయం ఉంది. సహజ నీటి వనరులు పరిమితంగా ఉన్న సింగపూర్.. వర్షపు నీటిని సేకరించడం, ఉపయోగించిన నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించడం, సముద్రపు నీటిని డీశాలినేషన్ చేయడం వంటి పద్ధతులను విస్తృతంగా ఉపయోగిస్తోంది. ముఖ్యంగా నీటి పునర్వినియోగం సముద్రపు నీటిని తాగునీటిగా మార్చే సాంకేతికత ద్వారా అక్కడ నీటి అవసరాల్లో గణనీయమైన భాగాన్ని సమకూర్చుకుంటున్నారు.

ఈ విధానం విశాఖకు కూడా ఉపయోగపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.విశాఖ చుట్టుపక్కల ఉన్న రిజర్వాయర్లు కూడా నగర నీటి అవసరాలకు ముఖ్యమైన వనరులే. వాటిలో పూడిక తొలగించడం, సామర్థ్యాన్ని పెంచడం, ఆధునిక నిర్వహణ పద్ధతులు అమలు చేయడం ద్వారా నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవడంతో పాటు కొత్త నీటి వనరులపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందిపోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరిజలాలను విశాఖకు తీసుకురావడం కూడా భవిష్యత్ నీటి అవసరాలకు ఉపయోగపడే అంశంగా భావిస్తున్నారు. ఈ నీటిని నిల్వ చేసేందుకు నగరం చుట్టూ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. అదే సమయంలో సముద్రం అందుబాటులో ఉన్నందున పెద్ద స్థాయిలో డీశాలినేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించవచ్చు.తాగునీరు, పరిశ్రమలు, భవిష్యత్ జనాభా అవసరాలను ఒకే ప్రణాళికలోకి తీసుకువచ్చి సమగ్ర వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే నీటి సరఫరాను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వర్షపు నీటి సంరక్షణ, రీసైక్లింగ్, రిజర్వాయర్ల ఆధునీకరణ, గోదావరి జలాల వినియోగం, డీశాలినేషన్ వంటి మార్గాలను కలిపి ముందుకు తీసుకెళ్లగలిగితే విశాఖ భవిష్యత్ నీటి అవసరాలకు ముందుగానే సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

## నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి

అంచనా వేస్తూ రైతులు, ప్రజలకు ఇబ్బందులు రాకుండా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరులు, వ్యవసాయ రంగంపై సమగ్ర కార్యాచరణ కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు. నీటి లభ్యత తగ్గుతున్న పరిస్థితుల్లో రైతులకు అందుబాటులో ఉన్న సాంకేతిక సేవలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేలా మైక్రో ఇరిగేషన్‌ను విస్తృతంగా అమలు చేయాలని ఆదేశించారు. అన్నదాతలను సూక్ష్మ సేద్యానికి మరింతగా అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏపీఎంఐపీ కింద కర్షకులకు సంబంధించిన నాలుగు కీలక సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి

సాంకేతిక సేవలు రైతులకు సులభంగా చేరేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. పంటలకు నీటి అవసరం, అందుబాటులో ఉన్న వనరులను బట్టి రైతులకు తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రకృతి సేద్యం వైపు అన్నదాతలను మళ్లించే కార్యాచరణను కూడా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. హై రిస్క్ ప్రాంతాల్లో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. విశాఖ తాగునీటి సరఫరాపై చంద్రబాబు ప్రత్యేకంగా అధికారులతో చర్చించారు. నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. బోర్లపై ఆధారపడే ప్రాంతాల్లో అవసరమైతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లను నింపేందుకు యుద్ధప్రాతిపదికన చేపట్టగల పనులపై అవకాశాలను పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.

### నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ నుంచి ప్యాకేజీ నంబర్ 8 కింద పైప్?లైన్? ద్వారా నీటిని తరలించే పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశాఖ నగరానికి మరో రెండు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. ఖరీఫ్ సీజన్ 2026కు సంబంధించి ఏపీలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం 513 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇందులో 268 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా, 245 మండలాల్లో మోస్తరుగా ఉన్నట్లు తెలిపారు. కరవు పరిస్థితులపై వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనుంది. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో క్షేత్రస్థాయి బృందాలు పంట నష్టం, దిగుబడి నష్టాన్ని పరిశీలించనున్నాయి. వ్యవసాయశాఖ క్షేత్ర పరిశీలన నివేదికను జిల్లా కలెక్టర్లకు సమర్పించనుంది. అనంతరం కరవు ప్రతిపాదనలను కలెక్టర్లు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖకు పంపించనున్నారు. ఈ ప్రతిపాదనలకు సెప్టెంబర్ 24ను తుది గడువుగా నిర్ణయించారు. సెప్టెంబర్ 29న రాష్ట్రస్థాయి కమిటీ కరవు ప్రతిపాదనలను పరిశీలించనుంది. కరవు మండలాల గుర్తింపు ప్రక్రియపై అధికారులతో జరిగిన సమీక్షలో ఆరు శాఖల నుంచి వచ్చే సమాచారాన్ని సమగ్రంగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు. వర్షపాతం, పంటల సాగు పరిస్థితి, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, శాటిలైట్ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలను విశ్లేషిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో వర్షాభావంతో పాటు ఎల్‌నినో ప్రభావం ఉద్యాన పంటలపై ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 21 జిల్లాల్లో 1357 ఆర్ఎస్‌కేల పరిధిలోని పంటలను హై రిస్క్ కేటగిరీలో గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎల్‌నినోతో 17,916 హెక్టార్లలోని నారింజ, బత్తాయి, మామిడి, ఎర్ర మిరప, ఉల్లి, కూరగాయల పంటలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ క్రమంలో స్పందించిన చంద్రబాబు ఉద్యాన పంటలను కాపాడేందుకు ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

## త్వరలో విశ్వనగరంగా విశాఖ

-మొదటిపేజీ తరువాయి


కార్యక్రమం ద్వారా ఇళ్లపై హక్కులు కల్పిస్తున్నాం. పేదలకు సొంతిళ్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పని చేస్తున్నాం. సొంతిల్లు ఉండాలనేది, ప్రతి మనిషి కల. దశాబ్దాల కష్టాలు, అనిశ్చితికి నేటితో ముగింపు పలుకుతున్నాం. మీ ఇళ్లపై ఇకనుంచి వివాదం లేదు, ఎలాంటి భయం లేదు. మీ ఇళ్లపై ఇకనుంచి బ్యాంకు రుణాలు కూడా తీసుకోవచ్చు.

రాజముద్ర వేసి మీకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. అభ్యంతరం లేని భూముల్లో పట్టాలు ఇస్తున్నాం. పేదలు స్వేచ్ఛగా బతకాలనే ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. ఇంకా 35 కాలనీల్లోని 10 వేల మంది పట్టాలు కోరుతున్నారు. దేవస్థానానికి చెందిన పంచగ్రామాల్లో 12,149 మందికి పట్టాలు ఇవ్వాలి. మిగతావారికి త్వరగా పట్టాలివ్వాలని అధికారులను ఆదేశిస్తున్నా. మీకు శాశ్వత చిరునామా కల్పించే బాధ్యత మా ప్రభుత్వానిది" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

"దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరం విశాఖ. విశాఖ త్వరలో విశ్వనగరంగా మారుతుంది. మీరంతా గర్వంగా చెప్పుకునేలా విశాఖను మారుస్తున్నాం. అల్లూరి విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి. టూరిజం, లాజిస్టిక్స్ హబ్‌గా విశాఖ మారనుంది. పోలవరం ఎడమ కాలువ త్వరలో విశాఖకు వస్తుంది. చంద్రబాబు విశాఖకు హైవేలు, పోర్టులు, విమానాశ్రయాలు వచ్చాయి. ఈ రెండేళ్లలో విశాఖకు 91 ప్రాజెక్టులు వచ్చాయి. ఈ విశ్వనగరంలో ప్రతి పేదవాడికీ భాగస్వామ్యం ఉండాలి."

## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన

-మొదటిపేజీ తరువాయి



రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు. ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వినాయక నిమజ్జన ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి వర్షిత కుటుంబానికి ఆర్థిక సాయం

- వర్షిత కుటుంబాన్ని పరామర్శించిన టీడీపీ నాయకులు
- వర్షిత తండ్రి అశోక్‌కు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేత
- టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తరపున సాయం
- పండుగ వేళ విషాదం చోటుచేసుకోవడం బాధాకరం: టీడీపీ నాయకులు
- వర్షిత కుటుంబానికి మనోధైర్యం కల్పించిన టీడీపీ నాయకులు




**ధర్మవరం,సెప్టెంబర్ 19 (పెన్ సత్తా)**నిన్నటి దినం ధర్మవరం పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా,కదిరి గేటు వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన చిన్నారి వర్షిత పార్థివ దేహాన్ని తెదేపా నాయకులు పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.పండుగ రోజున పేద కుటుంబంలో విషాదం చోటు చేసుకోవడం బాధాకరమని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తెదేపా నాయకులు ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ అందజేసిన 30 వేల రూపాయలను వర్షిత తండ్రి అశోక్ కు తెదేపా నాయకులు అందజేశారు.

# అక్టోబర్ 4న కర్నూల్ లో జరుగు ఆత్మీయ సమావేశమును విజయవంతం చేయండి



విశ్వహిందూ పరిషత్ శ్రీ సత్య సాయి జిల్లా ఉపాధ్యక్షులు వెంగముని

**ధర్మవరం,సెప్టెంబర్ 19 (పెన్ సత్తా)**విశ్వహిందూ పరిషత్ సంఘటనలో భాగంగా అశోక్ సింఘాల్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దేశం మొత్తం మీద ప్రాంత స్థాయిలో కేంద్ర, ప్రాంత పెద్దల సూచనల మేరకు విశ్వహిందూ పరిషత్ సామాజిక సమసత లో భాగంగా ప్రాంత స్థాయి కుల పెద్దల ఆత్మీయ సమావేశము అక్టోబర్ 4న కర్నూల్ మహానగరం నందు నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ శ్రీ సత్య సాయి జిల్లా ఉపాధ్యక్షులు వెంగముని,విభాగ కార్యదర్శి పులి చర్ల వేణుగోపాల్,జిల్లా కార్యదర్శి నరేంద్ర కుమార్,జిల్లా సహకార దర్శి దేవరకొండ రామానుజులు,జిల్లా గోరక్ష ప్రముఖ నరసింహారెడ్డి,ప్రఖండ అధ్యక్షులు శేషాద్రి, ప్రఖండ కార్యదర్శి తిరుపతయ్య, సహకార దర్శి కండే విశ్వనాథ్,సోషల్ మీడియా ఇంచార్జ్ బీరే శ్రీనివాసులు తెలిపారు.ఈ సందర్భంగా వారు కరపత్రాలను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా కుల పెద్దలు అందరూ కూడా ఆ సమావేశమునకు హాజరు కావలెనని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జల్లా రామ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు.. మానవత్వం చాటిన పద్మనాభం పోలీసులు



**పద్మనాభం, సెప్టెంబరు 19 । ఓఎస్‌జీ ప్రతినిధి:**పాంద్రంగి గ్రామ జంక్షన్ సమీపంలో గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి పద్మనాభం పోలీసులు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతదేహాన్ని గుర్తించిన అనంతరం పోలీసులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోస్టుమార్టం పూర్తి చేయించారు. అయితే మృతదేహాన్ని స్వీకరించి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పోలీసులు స్వయంగా బాధ్యత తీసుకున్నారు.పద్మనాభం ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసి, గుర్తుతెలియని వ్యక్తికి చివరి గౌరవం కల్పించారు. సాధారణంగా విధి నిర్వహణకే పరిమితం కాకుండా అనాథగా మిగిలిన మృతదేహానికి కూడా గౌరవప్రదమైన వీడ్కోలు అందించడం పట్ల స్థానికులు పోలీసుల సేవాభావాన్ని అభినందించారు.
ఈ సందర్భంగా పద్మనాభం సీఐ చంద్రమౌళి మాట్లాడుతూ.. పోలీసుల మానవతా సేవలను ప్రజలకు తెలియజేసిన మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు చొరవ చూపిన ఎస్ఐ గణేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని అభినందించారు. అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలవడంతో పాటు, ఆపదలో ఉన్నవారికి మానవతా దృక్పథంతో సేవ చేయడం పోలీసుల బాధ్యతలో భాగమని పేర్కొన్నారు.

## రాజాం పర్యటనలో చిన్న శ్రీను.. ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్‌తో భేటీ



**రాజాం, (పెన్ సత్తా) ప్రతినిధి:**తెలుగుదేశం పార్టీలో ఇటీవల చేరిన ఉమ్మడి విజయనగరం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) శనివారం రాజాం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్యాంపురంలోని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా ఇరువురు నాయకులు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధత తదితర అంశాలపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత పెంచాల్సిన అవసరంపై మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడం, నాయకులు--కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.
అనంతరం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ రాజాం నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలను చిన్న శ్రీనుకు పరిచయం చేశారు. వారితో చిన్న శ్రీను ఆత్మీయంగా మాట్లాడి పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై వివరాలు తెలుసుకున్నారు.
ఈ సమావేశంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, నెక్కల నాయుడు బాబు, జడ్పీటీసీలు వగ్రీ నరసింహమూర్తి, కెల్ల శ్రీనివాసరావు, వల్లిరెడ్డి శ్రీనివాసులు నాయుడు, నెల్లిమల్ల సీనియర్ నాయకుడు చిక్కాల సాంబశివరావుతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో సేవా కార్యక్రమాలు.. లడ్డూ విరాళం అందించిన నవీన్ జ్ఞానేశ్వర్





**ఆనందపురం (పెన్ సత్తా) ప్రతినిధి** వేములవలసలో వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేములవలస మాజీ ఉపసర్పంచ్, కోరాడ నాగభూషణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డన చేశారు.ఈ సందర్భంగా నవీన్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ వినాయక చవితి మహోత్సవాల్లో అన్నదాన కార్యక్రమం అత్యంత ముఖ్యమైనదని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో తనను భాగస్వామిని చేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. యువత ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.అనంతరం వేములవలస సత్యకళ్యాణి అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం కమిటీకి కోరాడ నాగభూషణ చారిటబుల్ ట్రస్ట్ తరపున 9 కిలోల అన్నమయ్య లడ్డూను ట్రస్ట్ చైర్మన్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

# మనోబందు సేవలు అభినందనీయం

**విజయవాడ, (పెన్ సత్తా)**మానసిక ఆరోగ్య సేవలు అవసరమైన వారికి మనోబందు సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ జి. వీరపాండ్యన్ ఐఏఎస్ అన్నారు. శనివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మనోబందు సంస్థ ఐదో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం తరపున టెలి-మానస్ సేవలు అందిస్తున్నామని, సహాయం కోసం 14416 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మనోబందు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు.మనోబందు వ్యవస్థాపకులు భూపతి రాజు రామకృష్ణ రాజు మాట్లాడుతూ.. మానసిక అనారోగ్యంతో రోడ్లపై జీవిస్తున్న వారిని గుర్తించి రక్షించడం, వైద్యం, పునరావాసం, కుటుంబాలతో పునఃకలయిక వంటి సేవలను సంస్థ అందిస్తోందన్నారు. 2025--26లో 60 రోజుల రెస్క్యూ కార్యక్రమంలో 105 మందిని రక్షించగా, 27 మందిని కుటుంబాలకు అప్పగించినట్లు, 51 మందికి ఆశ్రయ కేంద్రాల్లో పునరావాసం కల్పించినట్లు వివరించారు.కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు, వైద్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మనోబందు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్యకళ్యాణి అపార్ట్‌మెంట్ వినాయక మండపానికి ఘన విరాళాలు.. 30 కిలోల స్వీట్లు, గజమాల, లడ్డూ సమర్పించిన నవీన్ జ్ఞానేశ్వర్



**ఆనందపురం , (పెన్ సత్తా)** వేములవలస సత్యకళ్యాణి అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరాడ నాగభూషణం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వేములవలస మాజీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పాల్గొని భక్తులకు స్వయంగా అన్నదానం వడ్డించారు. ఈ సందర్భంగా కోరాడ నాగభూషణం చారిటబుల్ ట్రస్ట్ తరపున అన్నదాన కార్యక్రమానికి 21 కిలోల స్వీట్లను అందజేశారు. అలాగే విఘ్నేశ్వరుడికి గజమాలను సమర్పించారు. స్వామివారి ప్రసాదం నిమిత్తం 9 కిలోల అన్నమయ్య లడ్డూను మండపం కమిటీకి అందజేశారు.
వినాయకుడి ప్రసాదంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన 9 కిలోల అన్నమయ్య లడ్డూను వేలం నిర్వహించగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ లడ్డూ రూ.25 వేల ధరకు వేలంలో దక్కించుకోవడం విశేషం. దీంతో మండపం వద్ద భక్తుల్లో సందడి నెలకొంది.
ఈ సందర్భంగా నవీన్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ వినాయక చవితి మహోత్సవాల్లో అన్నదాన కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో తనను భాగస్వామిని చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. యువత, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని పేర్కొన్నారు. సత్యకళ్యాణి అపార్ట్‌మెంట్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లాలో 'ఆపరేషన్ వజ్రప్రహార్'

నేర నియంత్రణే లక్ష్యంగా విస్తృత కార్డన్ అండ్ సెర్చ్






**అనకాపల్లి, సెప్టెంబర్ 19 (పెన్ సత్తా)**జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా శనివారం తెల్లవారుజామున పోలీసులు 'ఆపరేషన్ వజ్రప్రహార్' నిర్వహించారు. అనకాపల్లి, నర్సీపట్నం సబ్‌డివిజన్ల పరిధిలో నేర నియంత్రణ, మాదకద్రవ్యాల కట్టడి, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా లక్ష్యంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.కసింకోట పరిధిలో సుమారు 70 మంది పోలీసులతో నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 37 ద్విచక్ర వాహనాలు, 6 మద్యం బాటిళు స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం ఎస్సీ కాలనీలో సుమారు 50 మంది సిబ్బందితో 230 ఇళ్లను తనిఖీ చేసి 440 మంది వివరాలను సేకరించారు. నార్కోటిక్ డాగ్ 'బన్నీ'తో గంజాయి, మత్తు పదార్థాలపై సోదాలు నిర్వహించారు. అనుమానితులు, పాత ఎన్‌డీపీఎస్ కేసు నిందితుడు, రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లను పరిశీలించారు.
మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## శ్రీ అభయ గణపతి ఆలయంలో మహా మంత్ర హోమం



**ఎంవీపీ కాలనీ, (పెన్ సత్తా)**ఎంవీపీ కాలనీ సెక్టార్-9, గోవా గార్డెన్ రెల్లి వీధిలోని శ్రీ అభయ గణపతి స్వామి ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా మంత్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ హోమ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మహా మంత్ర హోమం విశిష్టతను భక్తులకు వివరించారు. ఆధ్యాత్మిక విశ్వాసాల ప్రకారం హోమాలను ఏయే సందర్భాల్లో నిర్వహిస్తారు, వాటి ప్రాముఖ్యత ఏమిటి, హోమం ద్వారా కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఏమిటి అనే అంశాలను వివరించారు. భక్తులు హోమ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

# విశాఖ ఆర్‌కే బీచ్‌లో సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు





- సముద్ర వ్యర్థాలను సేకరించే పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులతో ముఖాముఖి
- సముద్రగర్భంలోని వ్యర్థాలను సేకరించే విధానంపై స్కూబా డైవర్లతో ముఖ్యమంత్రి ఇంటరాక్షన్
- సముద్రంలోని వ్యర్థాల సేకరణతో అదనపు ఆదాయం వస్తోందని సీఎంకు వివరించిన మత్స్యకారులు
- ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- సాగర తీరాన మురిమిక్చర్ రుచిని ఆస్వాదించిన ముఖ్యమంత్రి
- విశాఖ పర్యటనలో భాగంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి

**విశాఖపట్నం, (పెన్ సత్తా)**విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్‌లో నిర్వహిస్తోన్న సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఆర్కే బీచ్ సందర్శించారు. అక్కడ జరుగుతోన్న సాగర తీర స్వచ్ఛత కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉన్న మత్స్యకారులు, పారిశుద్ధ్య కార్మికులు, స్కూబా డైవర్లతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. బీచ్ శుభ్రత, సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, సముద్రగర్భంలోని వ్యర్థాల తొలగింపు తదితర కార్యక్రమాలను పరిశీలించి... వాటిలో భాగస్వాములైన వారి అనుభవాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ముందుగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి బీచ్ శుభ్రతలో పాల్గొన్న సీఎం... తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వారు చేపడుతున్న విధానాలను పరిశీలించారు. అనంతరం మత్స్యకారులతో మాట్లాడి.. చేపల వేటతో పాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. ప్రత్యేక వలలతో చేపల వేట సమయంలోనే ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్‌కు తరలిస్తున్నామని మత్స్యకారులు సీఎంకు వివరించారు. సేకరించిన వ్యర్థాలను డిజిటల్ తూకంపై బరువు కొలుస్తున్నామని... దాని ఆధారంగా ప్రోత్సాహకం అందుతోందని.. ఇది తమకు అదనపు ఆదాయమని మత్స్యకారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 1,200 టన్నుల సముద్ర ప్లాస్టిక్‌ను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. సముద్రంలో ప్లాస్టిక్ సేకరించి డిజిటల్ తూకం వేసే విధానాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి... వ్యర్థాల సేకరణ ద్వారా వచ్చే ప్రోత్సాహాన్ని మత్స్యకారులకు అందించారు.

### సాగర తీరంలోనూ... సముద్ర గర్భంలోనూ స్వచ్ఛత కార్యక్రమాలు...

మత్స్యకారులతో మాట్లాడిన అనంతరం అక్కడే ఉన్న స్కూబా డైవర్లతో సీఎం మాట్లాడారు. సముద్ర గర్భంలో రాళ్ల మధ్య, తీరానికి సమీప ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, పాడైన చేపల వలలు, సీసాలు, ప్యాకేజింగ్ వ్యర్థాలను తొలగిస్తున్న విధానాన్ని స్కూబా డైవర్లు సీఎంకు వివరించారు. మత్స్యకారుల పడవలతో కలిసి ఉపరితలంతోపాటు సముద్రగర్భంలోనూ వ్యర్థాలను సేకరిస్తున్నామని తెలిపారు. నీటిలోపల నిర్వహిస్తున్న శుభ్రత కార్యక్రమానికి సంబంధించిన దృశ్యాలను సీఎంకు చూపించారు. అనంతరం జీవీఎంసీ ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలను సీఎం సందర్శించారు. మురుగు కాల్వలు, మ్యాన్‌హోళ్ల శుభ్రతకు వినియోగించే సీవరేజ్ రోబోలను పరిశీలించారు. మెషిన్ల సాయంతో పారిశుద్ధ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు ఈ పరికరాలను వినియోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. విశాఖలో సముద్ర, తీర ప్రాంతాల శుభ్రతకు జీవీఎంసీ చేపడుతున్న ఇతర కార్యక్రమాలకు సంబంధించిన వీడియో ప్రజెంటేషన్ ను సీఎం తిలకించారు. ఈ సందర్భంగా బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రఫీస్ ప్రతినిధులు సీఎంను కలిసి సాగర స్వచ్ఛత ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. జీవీఎంసీ ప్రాజెక్టుకు లభించిన గ్లోబల్ గుర్తింపు, ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. పెదజాలరిపేటలో సుమారు 185 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.

### ఒంటరి మహిళకు పెన్షన్ ఇవ్వాలని సీఎం ఆదేశం

ఇదే సందర్భంలో ఆర్‌కే బీచ్‌లో మురిమిక్చర్ విక్రయిస్తున్న ఓ మహిళను సీఎం చంద్రబాబు పలకరించారు. ఆమె వ్యాపారం, జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. మురిమిక్చర్‌ను రుచి చూసిన సీఎం... ఆమె ఒంటరి మహిళ అని తెలుసుకుని, ఆమెకు పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- విశాఖ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**విశాఖపట్నం, (పెన్ సత్తా) :** పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 28,445 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించడం సాధారణ విషయం కాదని, దీని వెనుక అనేక సమస్యలను పరిష్కరించి, క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాల్సి వచ్చిందని తెలిపారు. సుమారు 400 ఎకరాల భూమికి సంబంధించి రూ.8,874 కోట్ల విలువైన పట్టాలు, కన్వేయన్స్ డీడులు అందించడం గర్వించదగిన విషయమన్నారు. పేదలు ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ఇళ్లకు చట్టబద్ధమైన భద్రత కల్పించడం ద్వారా వారి కుటుంబాలు, వారసులకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు విశాఖపట్నం అభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా గృహ నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన అవకతవకలను సరిదిద్దుతూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు. విశాఖపట్నానికి పెట్టుబడులను ఆకర్షించి, యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గేలా, స్థానిక యువతకు విద్య, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సమన్వయంతో విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని మంత్రి మనోహర్ పేర్కొన్నారు.



# విశాఖ త్రాగు, పారిశ్రామిక నీటి అవసరాలపై సిఎం సమగ్ర సమీక్ష.

**విశాఖపట్నం సెప్టెంబర్ 19 (పెన్ సత్తా)**సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విశాఖపట్నం నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత రాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర ప్రణాళిక రూపొందించారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విశాఖ భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ, చర్యలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. విశాఖ తాగునీటి అవసరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఇరిగేషన్, పురపాలక శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత నీటి వనరుల లభ్యత, నిల్వలు, పరిమితులు, ప్రత్యామ్నాయ మార్గాలు, పైప్‌లైన్లు, లిఫ్ట్‌ల ద్వారా నీటిని అందించే అవకాశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

### ఏలేరు--కణితి ద్వారా తాగునీటికి భరోసా

కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఏలేరు నుంచి ప్రస్తుతం రోజుకు 300 క్యూసెక్కుల నీరు అందుతోందని మంత్రి తెలిపారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లోనూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరు రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేయగలుగుతున్నామని చెప్పారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 10.2 టీఎంసీల నీరు ఉండగా, అందులో 6.1 టీఎంసీలు డెడ్ స్టోరేజ్గా ఉందన్నారు. 2027 జూన్ వరకు విశాఖకు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని ప్రణాళికాబద్ధంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఏలేరు నుంచి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వస్తున్న నీటిని 300 నుంచి 350 క్యూసెక్కులకు పెంచే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఏలేరు డెడ్ స్టోరేజీలోని నీటిని కూడా వినియోగించుకునేలా మోటార్లు, పంపులను ముందుగానే సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

### రైవాడకు ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి

విశాఖకు మరో ప్రధాన నీటి వనరైన రైవాడ రిజర్వాయర్ సామర్థ్యం 3.6 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 0.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. రైవాడ కింద ఉన్న సుమారు 5,000 ఎకరాల సాగును సమర్థవంతంగా నిర్వహిస్తూ, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారని చెప్పారు.రైవాడకు ప్రత్యామ్నాయంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటిని లిఫ్ట్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ఎల్ఎంసీ 162వ కిలోమీటర్ వద్ద లేదా అనువైన ప్రాంతంలో లిఫ్ట్ ఏర్పాటు చేసి రైవాడకు నీరు అందించే ప్రతిపాదనలను వారం రోజుల్లో పరిశీలించాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.

### మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీరు

విశాఖకు మరో ముఖ్యమైన నీటి వనరైన మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ సామర్థ్యం 1.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.2 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీటిని అందించే పైప్‌లైన్ పనులు ఇప్పటికే జరుగుతున్నాయని చెప్పారు. మొత్తం 10.5 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో 9 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మరో 1.5 కిలోమీటర్ల పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు.మిగిలిన పైప్‌లైన్ పనులతో పాటు మోటార్లు, పంపుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి మేఘాద్రిగెడ్డకు నీరు అందించాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. రైల్వే, ఎలక్ట్రికల్ క్రాసింగ్‌ల వద్ద ఉన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

### తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించాలి

తాటిపూడి రిజర్వాయర్ సామర్థ్యం 3.3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 1.2 నుంచి 1.26 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించడంతో పాటు విజయనగరం సాగునీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారని చెప్పారు. తక్కువ నీటితో పంటలు సాగు చేసే విధానాలను అవలంబించాలని, సాగునీటి వినియోగాన్ని పర్యవేక్షించాలని విజయనగరం కలెక్టర్‌ను సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

### పురుషోత్తపట్నం లిఫ్ట్ చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనం

విశాఖ తాగునీటి అవసరాల్లో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి అన్నారు. స్థానిక వర్షాలపై ఆధారపడే రైవాడ, మేఘాద్రిగెడ్డ, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరును నింపడం వల్లే ప్రస్తుతం విశాఖకు కీలకమైన నీటి సరఫరా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. పోలవరం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా అప్పట్లో పురుషోత్తపట్నం లిఫ్ట్‌ను ఏర్పాటు చేయడం చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనమన్నారు. గతంలో పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులను విమర్శించిన వారు, నేడు వాటి ప్రయోజనాలను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించడంతో శ్రీశైలం నీటిని రాయలసీమ, నాగార్జునసాగర్ తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అదేవిధంగా పురుషోత్తపట్నం ద్వారా ఏలేరును నింపడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా విశాఖ తాగునీటికి భరోసా ఏర్పడిందన్నారు.

### పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

2027లో పోలవరం పూర్తయిన వెంటనే పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా 17,500 క్యూసెక్కుల సామర్థ్యంతో ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్రకు అందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. పోలవరం పూర్తయి ఉంటే ఇప్పటికే ఉత్తరాంధ్రకు గోదావరి జలాల ప్రయోజనం మరింత ముందుగానే అందేదని మంత్రి అన్నారు. పోలవరం విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన జాప్యం వల్ల ఉత్తరాంధ్రకు నీటి ప్రయోజనాలు ఆలస్యమయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

### డేటా సెంటర్లపై తప్పుడు ప్రచారం వద్దు

రాబోయే డేటా సెంటర్లకు అవసరమైన నీటి పరిమాణంపై కూడా తప్పుడు ప్రచారం జరుగుతోందని మంత్రి అన్నారు. విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలను సమతుల్యం చేస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై దీర్ఘకాలిక దృష్టి

భవిష్యత్తులో విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత పరిష్కారం కోసం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులపై కూడా ప్రభుత్వం దృష్టి పెడుతోందని మంత్రి తెలిపారు. గ్రావిటీ ద్వారా విశాఖకు నీటిని అందించే అవకాశాలను కూడా పరిశీలిస్తూ దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

### సెప్టెంబర్ 23న మరోసారి సమీక్ష

సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో ఈ ఏడాది అత్యవసర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విశాఖకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 23న విశాఖ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్, పురపాలక శాఖ అధికారులతో మరోసారి సమావేశమై విశాఖకు శాశ్వత తాగునీటి పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు. విశాఖ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# ఇళ్ల పట్టాల పంపిణీ జిల్లా చరిత్రలో సువర్ణ అధ్యాయం

**జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**




**విశాఖపట్నం, (పెన్ సత్తా)**విశాఖపట్నం జిల్లాలో పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ చేపట్టిన ఇళ్ల పట్టాలు, కన్వేయన్స్ డీడుల పంపిణీ కార్యక్రమం జిల్లా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. శనివారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19,33,852.66 చదరపు గజాల విస్తీర్ణంలో సుమారు 400 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించి, మొత్తం 28,445 మంది లబ్ధిదారులకు రూ.8,874 కోట్ల విలువైన ఇళ్ల స్థల పట్టాలు, కన్వేయన్స్ డీడ్లు అందిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 296, 388, 84, 30, 45 ప్రకారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలు, కన్వేయన్స్ డీడుల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విశాఖపట్నం ఈస్ట్‌లో 6,555, వెస్ట్‌లో 5,093, నార్త్‌లో 2,601, పెందుర్తిలో 2,851, గాజువాకలో 6,134, భీమిలిలో 5,211 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతున్నట్లు తెలిపారు. రెగ్యులరైజేషన్ స్కీమ్-2025 కింద జీవో 30 ద్వారా 11,783 దరఖాస్తులను స్వీకరించి, క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అర్హత సాధించిన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేపడుతున్నట్లు గుర్తు చేశారు. అదేవిధంగా జీవో 45 కింద గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో 943 దరఖాస్తులకు ఆమోదం లభించినట్లు చెప్పారు. పట్టా కేవలం ఒక కాగితం కాదని, అది ఒక కుటుంబానికి భరోసా, ఇంటిపై హక్కు, భవిష్యత్‌పై నమ్మకమని కలెక్టర్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు. సొంతింటి కలను నిజం చేసే దిశగా పట్టాల పంపిణీ ఒక కీలక ముందడుగని అన్నారు.

### గ్లోబల్ సిటీగా విశాఖకు తోడ్పాటు...

విశాఖపట్నం అభివృద్ధిలో పరిశ్రమలు, ఐటీ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే 31 ఐటీ సంస్థలకు భూములు కేటాయించగా, రూ.1.40 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, 1.36 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. డేటా సెంటర్లు, ఎంఎస్ఎంఈలతో పాటు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ విభాగాలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గత ఏడాది నిర్వహించిన పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించిన స్ఫూర్తితో, ఈ ఏడాది కూడా సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ం

# పట్టాల పంపిణీతో పేదల ఆస్తికి భరోసా

**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**




**విశాఖపట్నం, పెన్ సత్తా)**పేదల భూమి, ఇంటికీ భరోసా కల్పించడమే ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో ఇవాళ ఒక గొప్ప పండుగ రోజని పేర్కొన్నారు. తాము నివసిస్తున్న భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలు, కన్వేయన్స్ డీడ్లు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా ఏర్పడుతుందన్నారు.విశాఖపట్నం ఒక చిన్న మత్స్యకార గ్రామం నుంచి నేడు విశ్వనగరంగా అభివృద్ధి చెందిందని, గతంలో హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయడంలో చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారన్నారు. అదే తరహాలో విశాఖపట్నాన్ని కూడా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2014-19 మధ్య విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్న సమయంలో విశాఖపట్నం ప్రజలకు సుమారు 63 వేల ఇళ్ల పట్టాలు అందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో విశాఖపట్నం, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు. 'డబుల్ ఇంజిన్ సర్కార్ - ట్రిపుల్ ఇంజిన్ గ్రోత్' లక్ష్యంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రభుత్వం పనిచేస్తోందని గుర్తు చేశారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ రాష్ట్ర, ప్రాంత అభివృద్ధి కోసం మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.?

# దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీ

దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీగా ఉందని, విద్యార్థులు ప్రశ్నలు అడగడం కూడా ఆ వ్యవస్థకు ఏ మాత్రం ఇష్టం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం రోజు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గొంతుక) కార్యక్రమంలో ఆయన విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, విద్యా వ్యవస్థ, దేశంలోని సంస్థల పనితీరుపైనా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులే దేశ భవిష్యత్తు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల్లేకుండా ఏ దేశమూ గొప్పగా ఎదగలేదని ఆయన అన్నారు. విద్యార్థులు ప్రశ్నలు అడగడం, వ్యవస్థను ప్రశ్నించడం అనేది ప్రజాస్వామ్యానికి అవసరమని, కానీ ఇక్కడ విద్యార్థులు ప్రశ్నలు అడగటం వల్లే వ్యవస్థ వారిని భయపెడుతోందని రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు.

విద్యార్థులు ప్రశ్నలు అడుగుతారని ముఖ్యంగా రాజకీయ నాయకుల కుటుంబ సభ్యుల ఎదుగుదల, దేశంలోని వ్యాపార రంగంలో కొందరి ఆధిపత్యం, న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం వంటి సంస్థల పనితీరుపైనా ప్రశ్నలు అడుగుతారని రాహుల్ గాంధీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి, అంధభక్త్‌కు ఉన్న వ్యత్యాసం గురించి రాహుల్ స్పష్టంగా వివరించారు. 'విద్యార్థి నిరంతరం ప్రశ్నలు అడుగుతాడు. కొత్త విషయాల్ని తెలుసుకోవాలనే కుతూహలంతో ఉంటాడు. విద్యార్థి కాబట్టే అమిత్ షా కుమారుడు క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్‌గా ఎలా అయ్యాడు? ఇద్దరు వ్యక్తులు దేశంలోని వ్యాపారాలన్నింటినీ ఎలా కబ్జా చేశారు? న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం తమ బాధ్యతల్ని ఎందుకు సరిగా నిర్వహించడం లేదు.' అని ప్రశ్నిస్తున్నాడని రాహుల్ అన్నారు.



అదే అంధభక్త్ గురించి ప్రస్తావించిన రాహుల్ గాంధీ- 'అంధభక్తుడు ఎలాంటి ప్రశ్నలు అడగడు. మోదీని విష్ణువు అవతారంగా భావిస్తూ తనదైన ఊహా ప్రపంచంలో బతుకుతాడు. అంధ్‌భక్త్ పిరికివాడు. మన పాఠశాలలు, కాలేజీల పరిస్థితి ఎందుకు దిగజారింది? మౌలిక సదుపాయాలు ఎందుకు దెబ్బతిన్నాయి? ప్రశ్నాపత్రాలు ఎందుకు లీక్ అవుతున్నాయో అంధ్‌భక్త్ ఎప్పటికీ ప్రశ్నించడు.' అని రాహుల్ అన్నారు. అందుకే ప్రశ్నలు అడిగే విద్యార్థుల్ని కాకుండా, అసలేం ప్రశ్నలు వేయకుండా నమ్మే వ్యక్తుల్ని వ్యవస్థ కోరుకుంటోందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు సంతోషంగా లేరని, అసౌకర్యంగా, ఒత్తిడిలో ఉన్నారని, వారి భవిష్యత్తుపై వారికి స్పష్టమైన నమ్మకం కూడా కనిపించట్లేదని అన్నారు.

**ఆ ఆరుగురే వ్యవస్థను నడిపిస్తున్నారు: రాహుల్ గాంధీ**

ఇదే సమయంలో దేశంలోని ప్రస్తుత వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేస్తూ- ఈ వ్యవస్థ వెనుక ఆరుగురు కీలక వ్యక్తులు ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు రాహుల్ గాంధీ. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో పాటు పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీల పేర్లను ప్రస్తావిస్తూ వీరే వ్యవస్థను నడిపిస్తున్నారని ఆరోపించారు. అజిత్ డోభాల్ సోషల్ మీడియా సహా అనేక వ్యవస్థల్ని నియంత్రిస్తున్నారని, ఫోన్ ట్యాపింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలపై నిఘా పెట్టి సమాచారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా కు చేరవేస్తారని ఆరోపించారు. ఇంకా వివిధ సంస్థల్లో తమకు అనుకూల వ్యక్తులనే వ్యవస్థ నియమించుకుందని మండిపడ్డారు. మోహన్ భాగవత్ సిద్ధాంతపరమైన అంశాల్ని పర్యవేక్షిస్తారని, ఇంకా అంబానీ, అదానీ వ్యవస్థకు ఇరువైపులా ఆర్థిక శక్తులుగా ఉన్నారని అన్నారు.

తన ప్రసంగంలో ఇంకా ఇతర సమస్యలపై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 10 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇంకా సుమారు లక్ష పాఠశాలలు మూతపడ్డాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. మూతపడ్డ పాఠశాలల్లో 55 శాతం ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలపై విద్యార్థులు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఛాత్రోం కీ గూంజ్ ప్రచారం ద్వారా కాంగ్రెస్ విద్యార్థులు, యువత సమస్యల్ని తెలుసుకుంటోంది. ముఖ్యంగా పలు పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలు, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న ఫీజులు, ఉద్యోగ నియామకాల్లో సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై పోరాడుతోంది. ఇప్పటికే కొద్ది నెలలుగా రాహుల్ గాంధీ దేశంలోని పలు నగరాల్లో (కోటా, డేహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్, పుణె) ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు.

# నైరుతి రుతుపవనాల తిరోగమనం షురూ

భారతదేశంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలం ముగింపు దశకు చేరుకుంది. దేశంలో రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. 2026, సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి వెళ్లినట్లు భారత వాతావరణ శాఖ (×వీణ) తెలిపింది. సాధారణంగా సెప్టెంబర్ 17 నాటికే రాజస్థాన్ నుంచి ఈ నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, ఈ ఏడాది 2 రోజులు ఆలస్యంగా తిరోగమనం ప్రారంభమైంది. ఐఎండీ ప్రకారం రాబోయే 3 నుంచి 4 రోజుల్లో రాజస్థాన్‌లోని ఇతర ప్రాంతాలతో పాటుగా పంజాబ్, కచ్, సౌరాష్ట్రలోని కొన్ని ప్రాంతాల నుంచి కూడా ఈ రుతుపవనాలు వెనక్కి వెళ్లడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

**జూన్ 4న కేరళలోకి ఎంట్రీ- జులై 9న దేశమంతటా విస్తరణ**

ఇక ఈ ఏడాది జూన్ 4న కేరళలోకి తొలుత నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. తర్వాత క్రమక్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. జులై 9 నాటికి దేశం మొత్తం రుతుపవనాలు వ్యాపించాయి. ఇప్పుడు సెప్టెంబర్ మూడో వారంలో పశ్చిమ రాజస్థాన్ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. అయితే ఈ సారి నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా వర్షపాతం ఆశించిన స్థాయిలో లేదు. ఐఎండీ డేటా ప్రకారం జూన్ 4 నుంచి సెప్టెంబర్ 19 వరకు దేశవ్యాప్తంగా చూస్తే వర్షపాతం లోటు 15 శాతంగా ఉంది. వర్షపాతం లోటు అధికంగా ఉన్న ప్రాంతాల్లో దక్షిణ ద్వీపకల్పం ఉంది. దేశంలోనే అత్యధికంగా



ఇక్కడ ఏకంగా 29 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

**ఒక్క జులైలోనే అధిక వర్షపాతం నమోదు**

ఈ రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు జులై నెలలో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. అంటే ఈ ఒక్క నెలలోనే సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షపాతం (సర్‌ప్లస్) నమోదైందన్నమాట. జులై నెలలో సగటు సాధారణ వర్షపాతం 280.5 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది జులైలో ఏకంగా 283.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంతకుముందు జూన్ నెలలో పరిస్థితి భిన్నంగా ఉంది. వాస్తవానికి రుతుపవనాలే పలు ప్రాంతాల్లో కాస్త ఆలస్యంగా వచ్చాయంటే, వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురిశాయి. సాధారణంగా జూన్‌లో 165 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 106.8 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో జూన్ నెలలో దేశవ్యాప్తంగా చూస్తే 35 శాతం లోటు వర్షపాతం (డెఫిసిట్) నమోదైంది.

గత నెల ఆగస్టులో కూడా పరిస్థితులు ఏమంత మెరుగ్గా లేవు. ఆగస్ట్ 31న ఐఎండీ నెలవారీగా విడుదల చేసే డేటా ప్రకారం చూస్తే ఆగస్టులో దేశవ్యాప్తంగా 213.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2001 తర్వాత ఆగస్ట్ నెలలో నమోదైన ఏడో అత్యల్ప వర్షపాతం ఇదే కావడం గమనార్హం.

**ఎల్‌నినో ఎఫెక్ట్‌తోనే లోటు వర్షపాతం**

ఈ 2026 ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షపాతం తగ్గడానికి ప్రధాన కారణాల్లో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం. సదర్న్ ఆసిలేషన్ (జుచీూా) అనే వాతావరణ వ్యవస్థలోని 3 దశల్లో ఈ ఎల్‌నినో ఒకటి. ఇక్కడ పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులతో పాటు ఇంకా వాతావరణ మార్పులు కూడా సంభవించే పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల వర్షపాతాలు తగ్గడమే కాకుండా వాతావరణంలో వేడి విపరీతంగా పెరుగుతుంది. సకాలంలో వర్షాలు కురవవు. అదే విధంగా అకాలంగా ఉరుములు, మెరుపులు సహా వడగండ్ల వానలకు దారితీస్తుంది. కొన్ని చోట్ల కురవాల్సిన దాని కంటే తక్కువగా, కొన్ని చోట్ల అకాలంగా కురుస్తుంటాయి. రుతుపవనాలు ముగిసే సమయంలో అకస్మాత్తుగా భారీ వర్షాలు కూడా పడే ప్రమాదం ఉందని గతంలోనే ఐఎండీ హెచ్చరించింది. ఇక ఎల్‌నినోకు వ్యతిరేకంగా ఉండే దశను లా నినా (ఌఖ చీఱఅఖ) అని పిలుస్తారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. మధ్యలో న్యూట్రల్ ఫేజ్ కూడా ఉంటుంది.

# టీఎంసీ పేరు, గుర్తు వివాదం
# ఈసీ నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమత

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ఇప్పుడు న్యాయస్థానం ముందుకు చేరాయి. పార్టీ పేరు, ఎన్నికల గుర్తుపై ఎన్నికల సంఘం (ఈసీ) తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ నేత మమతా బెనర్జీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పార్టీకి చెందిన రెండు వర్గాలు- ఏఐటీసీ పార్టీ పేరు, గుర్తు, సంస్థాగత నియంత్రణపై హక్కు కోరుతున్న నేపథ్యంలో అసలు పేరు, గుర్తును తాత్కాలికంగా నిలిపివేసింది. 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరుతో పాటు పార్టీకి రిజర్వ్ చేసిన 'పూలు, గడ్డి' గుర్తును రెండు వర్గాలు ఉపయోగించకూడదని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పార్టీపై హక్కు విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి మరింత పరిశీలన అవసరమని స్పష్టం చేసింది. ఈ వివాదంపై మమతా బెనర్జీ వర్గం, ప్రత్యర్థి వర్గం ప్రతినిధుల వాదనలు విన్న అనంతరం ఈసీ ఈ నిర్ణయానికి వచ్చింది. ఎన్నికల గుర్తుల కేటాయింపునకు సంబంధించిన 1968 నాటి నిబంధనల ప్రకారం వివాదాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉందని ఎన్నికల సంఘం పేర్కొంది.

**రెండు వర్గాలకు కొత్త పేర్లు, గుర్తులు**

అక్టోబర్ 6న జరగనున్న బంగాల్ అసెంబ్లీ ఉపఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు వర్గాలకు ఈసీ తాత్కాలికంగా కొత్త పేర్లు, గుర్తులు కేటాయించింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరు, 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును కేటాయించింది. మరో వర్గానికి 'డెమొక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఎన్వలప్' గుర్తు ఇచ్చింది. ఈ కేటాయింపులు ప్రస్తుతం జరగనున్న ఉపఎన్నికల కోసం మధ్యంతరంగా వర్తిస్తాయని ఈసీ పేర్కొంది.

**'పార్టీ గుర్తింపు కోల్పోవడం బాధాకరం'**

ఈసీ నిర్ణయంపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పార్టీ పేరు, గుర్తును కోల్పోవడాన్ని తల్లి తన బిడ్డను



కోల్పోయిన బాధతో పోల్చారు. ఈ పరిణామాన్ని దేశ ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డేగా అభివర్ణించారు. అయితే ఈసీ ఏర్పాటు చేసిన మధ్యంతర వ్యవస్థను తుది పరిష్కారంగా అంగీకరించబోమని మమత స్పష్టం చేశారు. పార్టీ అసలు పేరు, సంప్రదాయ గుర్తును తిరిగి పొందేందుకు రాజకీయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తానని ప్రకటించారు. మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌లో ఎన్నికల సంఘంతో పాటు బంగాల్? అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న రితబ్రత బెనర్జీని ప్రతివాదులుగా చేర్చారు. ఈసీ తీసుకున్న మధ్యంతర నిర్ణయాన్ని రద్దు చేసి, పార్టీ అసలు పేరు, గుర్తుపై తమ హక్కును కొనసాగించేందుకు అనుమతించాలని ఆమె న్యాయపరమైన సవాల్ చేశారు.

**ఉపఎన్నికల నేపథ్యంలో కీలక పరిణామం**

బంగాల్‌లోని నందిగ్రామ్, రేజీనగర్ అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 6న ఉపఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు అక్టోబర్ 9న జరగనుంది. ఈ నేపథ్యంలో రెండు వర్గాలు ఏ పేరుతో, ఏ గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగుతాయన్న అంశానికి ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ఉప ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ మమత వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి రబియుల్ ఆలం చౌదరి రేజీనగర్ ఉప ఎన్నిక బరి నుంచి వైదొలిగారు. తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు. మమత వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ శుక్రవారం నందిగ్రామ్ ఉప ఎన్నిక బరి నుంచి వైదొలిగారు. ఈ మరుసటిరోజే మరో అభ్యర్థి కూడా వెనక్కి తగ్గడం గమనార్హం.

**అసలు వివాదం ఎలా మొదలైంది?**

టీఎంసీలో ప్రస్తుత సంక్షోభానికి 2026 అసెంబ్లీ ఎన్నికల అనంతరం పార్టీలో ఏర్పడిన విభేదాలు నేపథ్యంగా నిలిచాయి. క్రమంగా ఈ విభేదాలు శాసనసభా పక్షానికి, ఆ తర్వాత పార్లమెంటరీ విభాగానికీ విస్తరించాయి. పార్టీ అంతర్గత విభేదాల నేపథ్యంలో 58 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీని శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్నారని, స్పీకర్ నుంచి గుర్తింపు పొందారని వార్తా నివేదికలు పేర్కొన్నాయి. దీంతో టీఎంసీ తన 28 ఏళ్ల చరిత్రలో మొదటి పెద్ద విభజనను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. తర్వాత ఈ వివాదం పార్లమెంటుకూ చేరింది. 20 మంది లోక్‌సభ సభ్యులు ప్రత్యేక బ్లాక్‌గా వ్యవహరించేందుకు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడం ద్వారా విభేదాలు మరింత స్పష్టమయ్యాయి. ఈ పరిణామాల మధ్య పార్టీ పేరు, గుర్తుపై ఇరు వర్గాల హక్కుల పోరు ఎన్నికల సంఘం ముందుకు వెళ్లింది.

## 20ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది

రానున్న 20 ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ధీమా వ్యక్తం చేశారు. దేశం భారీ మార్పులతో అద్భుతమైన భవిష్యత్తు వైపు దూసుకుపోతోందని ఉద్ఘాటించారు. ప్రస్తుతం 4 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత జీడీపీ రానున్న రెండు దశాబ్దాల్లో 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని డోభాల్ వెల్లడించారు. ప్రధాని మోదీ చెప్పినట్లే 2047 వరకు ఉన్న సమయం నిజంగా 'అమృత కాలం' అని ఆయన అభివర్ణించారు. ఇలాంటి పరివర్తనాత్మక యుగంలో జీవిస్తున్న విద్యార్థులు ఎంతో అదృష్టవంతులని చెప్పారు. ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ మేరకు ప్రసంగించారు.

"నేటి యువతరం ముందు ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. మీ ముందు తరాల వారు బానిసత్వంలో మగ్గిపోతూ ఎన్నో కష్టాలు పడ్డారు. ఇప్పుడు మీ ముందున్నటువంటి అవకాశాలు వారికి రాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులు మీ కోసం మరింత అనుకూలంగా మారాయి. వృద్ధి సాధించడంలో ఏ దేశానికైనా సాంకేతికత అత్యంత కీలకమైన చోదక శక్తిగా ఉండే దశలోకి మీరు అడుగుపెడుతున్నారు. సమయం మీకు అనుకూలంగా ఉంది. మీలో అపారమైన శక్తి ఉంది. మీ ముందు ఇంకా ఎన్నో దశాబ్దాల భవిష్యత్తు ఉంది. రానున్న ఆరు, ఏడు దశాబ్దాల కాలంలో మీరు ఎన్నో అద్భుతాలను సాధించగలుగుతారు. అంతేకాదు, మీ జీవిత ప్రయాణంలో శ్రీరాముడి వలే ధైర్యంగా ఉండి ముందుకు సాగాలి. ఎందుకంటే, రాముడు చూపించిన ధైర్యసాహసాల కారణంగానే రాక్షస సంహారం కోసం విశ్వామిత్ర మహర్షి ఆయన్ను ఎంచుకున్నారు."

**'సొంత విధానాన్ని రూపొందించుకోవాలి'**

ఒక నాయకుడిగా ఎదగడానికి సొంత విధానాన్ని రూపొందించుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం చాలా కీలకమని అజిత్ డోభాల్? పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభ రోజుల్లో సిక్కింలో పనిచేసిన అనుభవాలను ఆయన పంచుకున్నారు. "అప్పట్లో నేను ఐపీఎస్ అధికారిగా ఉన్న సమయంలో సిక్కింలో ఇంటెలిజెన్స్ ఇన్‌ఛార్జ్‌గా నన్ను నియమించారు. ఆ వృత్తికి నేను కొత్త. అంతేకాదు, అప్పుడు సిక్కిం ఇంకా భారత్?లో పూర్తిగా విలీనం కాలేదు. ఆ ప్రక్రియ జరుగుతోంది. ఆ సమయంలో, సరిహద్దు ప్రాంతాలను పర్యవేక్షించడం, పీఎల్‌ఏ కదలికలు, చైనా సైన్యం కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించడం వంటి బాధ్యతల్లో ఒకటిగా ఉండేవి. ఒకసారి, సరిహద్దు ప్రాంతంలో ఇంటెలిజెన్స్ మిషన్ (గూఢచారి కార్యకలాపం) చేపట్టాం. ఆ సమయంలో సరిహద్దు దాటించి వెళ్లిన ఒక నిఘా బృందం నిర్ణీత సమయంలోగా తిరిగి రాలేకపోయింది. వాళ్లు, అసలు బతికి ఉన్నారో లేదో, వారికి ఏమైందో తెలియకపోవడం వృత్తిపరంగానే కాకుండా మానవీయ కోణంలో కూడా నాకు తీవ్ర ఆందోళన కలిగించింది. అప్పుడు నాకు ప్రధాన కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. 'నువ్వు కొంతమందిని అవతలి వైపుకు పంపావా?' అని పై అధికారి నన్ను ప్రశ్నించారు. నేను, 'నాకు తెలియదు. వారు ఇప్పటికే రావాల్సింది, కానీ రాలేదు' అని చెప్పాను. అప్పుడు ఆయన, 'వారు ఇప్పుడు చైనా అదుపులో ఉన్నారు' అని చెప్పారు. ఆ తర్వాత చైనా వాళు వారిని పట్టుకుని విచారించి చర్చలు లేదా ఒప్పందం తర్వాత తిరిగి పంపించారు. అనంతరం ఆ విషయంపై విచారణ చేపట్టారు. ఆ సమయంలో నా కెరీర్ ముగిసిపోయిందని భావించా. మళ్లీ కొత్త కెరీర్ మొదలుపెట్టాల్సి వస్తుందని అనుకున్నా. కానీ, అందులో నా తప్పేమీ లేదని తేలింది" అని డోభాల్? పేర్కొన్నారు.

## బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం

2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు. భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.

ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

**'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో సేవ**

ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి'ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.

**51 వేల మందికి పైగా నియామక పత్రాలు**

20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

## యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం.. నగదు మాత్రమే!

**దిల్లీ:** కేంద్రం తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని, నగదు మాత్రమే తీసుకుంటామని కొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. ఒకవేళ యూపీఐ పేమెంట్ చేస్తే అదనంగా చెల్లించాలంటున్నారు. దిల్లీ శివారులోని




ఘజియాబాద్‌లో ఈ తరహా బోర్డులు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పెద్ద వ్యాపార సంస్థలు, ఇ-కామర్స్ సంస్థలతో (పీ2ఎం) చేసే రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి దీనిని అమలు చేయనున్నారు. కాగా, దీనిపై వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదనపు ఖర్చును భరించేందుకు వారు ఇష్టపడటం లేదు. ఎండీఆర్ అమల్లోకి వచ్చిన తర్వాత వీలైనంత వరకు నగదునే చెల్లించాలని పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసేవారిని ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు.

# డిసెంబరులో ఐపీఎల్ 2027 మినీ వేలం




ముంబై సెప్టెంబరు 19 :
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్ మినీ వేలానికి సంబంధించి కీలక అప్‌డేట్ వెలువడింది. క్రిక్‌ఇన్ఫో కథనం ప్రకారం, ఈ మినీ వేలం డిసెంబర్ రెండో వారంలో (డిసెంబర్ 7 నుండి 13 మధ్య) జరిగే అవకాశం ఉంది. గత మూడు సీజన్లుగా దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో జరిగిన ఈ వేలం, ఈసారి మళ్లీ భారత గడ్డపైనే నిర్వహించేందుకు బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత సైకిల్‌లో జరగబోయే ఆఖరి మినీ వేలం ఇదే కావడం విశేషం. వేలం వేదిక ఎంపికపై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పందిస్తూ.. డిసెంబర్ నెలలో దేశవ్యాప్తంగా వివాహాల సీజన్ ఎక్కువగా ఉండటం వల్ల 10 ఫ్రాంచైజీలకు కావలసిన వందకు పైగా హోటల్ గదుల లభ్యత ఆధారంగా తుది నగరం, షెడ్యూల్‌ను ఖరారు చేస్తామని తెలిపారు. ఈ మినీ వేలంలో జట్లు తమ పాత ఆటగాళ్లను చాలావరకు అట్టిపెట్టుకునే అవకాశం ఉంది. 2027 సీజన్ కోసం ప్రతి ఫ్రాంచైజీ బేస్‌లైన్ పర్స్ విలువ రూ. 120 కోట్లు కాగా, మొత్తం సాలరీ క్యాప్‌ను రూ. 157 కోట్లుగా నిర్ణయించారు. ఇక మ్యాచ్‌లో ఉపయోగించే వివాదాస్పద 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధన కొనసాగింపుపై గవర్నింగ్ కౌన్సిల్ త్వరలోనే సమీక్షించనుంది.



## జైస్వాల్‌కు వన్డేల్లో మరిన్ని అవకాశాలు ఇవ్వాలి

### ఇర్ఫాన్ పఠాన్

న్యూఢిల్లీ సెప్టెంబరు 19 :
వెస్టిండీస్‌తో సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి జైస్వాల్ తగినంత మ్యాచ్ అనుభవం సాధించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించాడు. ప్రస్తుతం భారత వన్డే జట్టులో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ తర్వాత జైస్వాల్ మూడో ఓపెనర్‌గా (బ్యాకప్ ఓపెనర్) ఉన్నాడని పఠాన్ గుర్తుచేశాడు. ఇప్పటివరకు ఆడిన ఆరు వన్డేల్లోనే రెండు సెంచరీలు సాధించిన జైస్వాల్‌ను ప్రపంచకప్‌కు ముందు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నాడు. ప్రపంచకప్‌నకు ముందు భారత్ మరో 11 వన్డేలు ఆడనుందని, ఈ క్రమంలో బెంచ్ బలాన్ని పరీక్షించడం ఎంతో ముఖ్యమని తెలిపాడు. ఇక ఆసియా క్రీడలు, వెస్టిండీస్ సిరీస్ ఒకే సమయంలో రావడం వల్ల నితీశ్ కుమార్ రెడ్డి, ఆకిబ్ నబీ, నమన్ ధీర్, ధ్రువ్ జురెల్ వంటి యువ ఆటగాళ్లకు తమ సత్తా చాటేందుకు మంచి అవకాశం దక్కిందని పఠాన్ పేర్కొన్నాడు.

# పుజారానే తాను ఎదుర్కొన్న అత్యంత కఠినమైన బ్యాటర్

## ప్యాట్ కమిన్స్






మెల్‌బోర్న్ సెప్టెంబరు 19 :
భారత క్రికెట్‌లో తాను ఎదుర్కొన్న అత్యంత కఠినమైన బ్యాటర్ విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ కాదని, మాజీ టెస్ట్ బ్యాటర్ చతేశ్వర్ పుజారానే అని ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెల్లడించాడు. ఇటీవల 'ప్రైమ్ వీడియో స్పోర్ట్' ఇంటర్వ్యూలో వివిధ దేశాలకు చెందిన కఠినమైన బ్యాటర్ల గురించి మాట్లాడిన కమిన్స్, భారత్ తరఫున పుజారా పేరును ఎంపిక చేశాడు. పుజారాను వికెట్ తీయడం చాలా కష్టమని, అతనికి బౌలింగ్ చేయడం 'చిన్న చిన్న దెబ్బలతో క్రమంగా చావగొట్టినట్లు' ఉంటుందని కమిన్స్ సరదాగా వ్యాఖ్యానించాడు. వికెట్ కాపాడుకోవడం కోసం పుజారా 100 డాట్ బాల్స్ ఆడేందుకైనా వెనుకాడడని, బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వడని కొనియాడాడు. ఆస్ట్రేలియాపై భారత్ సాధించిన 2018-19, 2020-21 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ విజయాల్లో పుజారా ఓపికైన బ్యాటింగ్ కీలక పాత్ర పోషించింది. ఇతర దేశాల నుంచి సయీద్ అజ్మల్, అలిస్టర్ కుక్, ఏబీ డివిలియర్స్, బ్రెండన్ మెకల్లమ్, తిలకరత్నే దిల్షాన్, క్రిస్ గేల్ పేర్లను కమిన్స్ ప్రస్తావించాడు. కాగా, కమిన్స్ ఎంచుకున్న జాబితాలో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఆటగాళ్లే ఉండటం విశేషం. 103 టెస్టుల్లో 7,195 పరుగులు చేసిన పుజారా 2025లో రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# నాగోయా పయనానికి ముందే టీమిండియాకు కిట్ కష్టాలు

న్యూఢిల్లీ సెప్టెంబరు 19 :
ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు భారత పురుషుల క్రికెట్ జట్టు ఆదివారం తెల్లవారుజామున ఢిల్లీ నుంచి జపాన్‌లోని నాగోయాకు బయలుదేరనుంది. అయితే ప్రయాణానికి ముందే జట్టుకు కిట్ సమస్యలు ఎదురయ్యాయి. కొందరు ఆటగాళ్లకు సరైన పరిమాణంలో అధికారిక క్రీడా దుస్తులు ఇంకా అందలేదని సమాచారం. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి, భారత ఒలింపిక్ సంఘం కిట్ సరఫరాదారు మధ్య పలుమార్లు చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. చాలా మంది ఆటగాళ్ల పరిమాణ సమస్యలు ఇప్పటికే పరిష్కారమయ్యాయి. మిగిలిన ఆటగాళ్లకు కూడా త్వరలోనే కిట్లు అందనున్నట్లు సమాచారం. జపాన్‌లో భారత ఆటగాళ్లు రెండు రకాల జెర్సీలు ధరించనున్నారు. సెప్టెంబరు 22న జపాన్‌తో జరిగే స్నేహపూర్వక టీ20 మ్యాచ్‌లో సాధారణ భారత జట్టు జెర్సీతో బరిలోకి దిగనుండగా.. సెప్టెంబరు 28న ప్రారంభమయ్యే ఆసియా క్రీడల క్వార్టర్ ఫైనల్ నుంచి అధికారిక ఆసియా క్రీడల జెర్సీని ధరిస్తారు. కిట్ సమస్య ఇప్పటికే భారత బృందంలోని మరో అథ్లెట్‌పై ప్రభావం చూపింది. షాట్‌పుట్ క్రీడాకారుడు తజిందర్‌పాల్ సింగ్ తూర్‌కు అధికారిక దుస్తులు అందకపోవడంతో ఆసియా క్రీడల ప్రారంభోత్సవంలో భారత పురుషుల పతాకధారిగా పాల్గొనలేకపోయారు. దీంతో ఆయన స్థానంలో కబడ్డీ ఆటగాడు పవన్ సెహ్రావత్‌ను పతాకధారిగా ఎంపిక చేశారు. మరోవైపు క్రికెట్ జట్టు బస విషయంలోనూ బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నిర్వాహకులు కేటాయించిన గదుల్లో భారీ కిట్ బ్యాగులను ఉంచేందుకు తగినంత స్థలం లేకపోవడంతో వాటి కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేసినట్లు సమాచారం. మహిళల క్రికెట్ జట్టు మాత్రం భారత ఒలింపిక్ సంఘం ఏర్పాటు చేసిన వసతిలోనే బస చేయనుంది. పురుషుల క్రికెట్‌లో భారత్‌కు నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్ లభించింది. సెప్టెంబరు 28న గ్రూప్-ఏలో రెండో స్థానంలో నిలిచే జట్టుతో భారత్ తలపడనుంది. సెప్టెంబరు 22న జపాన్‌తో స్నేహపూర్వక మ్యాచ్ ముగిసిన అనంతరం భారత జట్టు పూర్తిగా ఆసియా క్రీడల పోరుపైనే దృష్టి పెట్టనుంది.



# భారత్‌తో టీ20 సిరీస్‌కు రచిన్ దూరం?




ఆక్లాండ్, సెప్టెంబరు 19 :
టీమిండియాతో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. ఆక్లాండ్‌లో ఓ వాణిజ్య ప్రకటన షూటింగ్‌లో డైవింగ్ క్యాచ్ ప్రయత్నించిన సమయంలో కిందపడటంతో అతడి కుడి భుజానికి గాయమైంది. బుధవారం జరిగిన షూటింగ్‌లో సేఫ్టీ మ్యాట్‌పై అదుపుతప్పి పడటంతో రచిన్ భుజం స్థానభ్రంశం చెందినట్లు సమాచారం. అయితే శుక్రవారం వైద్యులు పరీక్షించిన అనంతరం భుజంలో తీవ్రమైన నిర్మాణాత్మక నష్టం ఏమీ లేదని నిర్ధారించారు. అయినప్పటికీ పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాల పాటు పునరావాసం అవసరమని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. ఈ ఘటనపై న్యూజిలాండ్ ప్రదర్శన నిర్వహణ విభాగం స్పందిస్తూ.. రచిన్ త్వరగా కోలుకోవడమే తమ ప్రాధాన్యమని పేర్కొంది. భద్రతా ప్రమాణాలు పాటించినప్పటికీ అనుకోకుండా ఈ ప్రమాదం జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తమ విధానాలను సమీక్షిస్తామని వెల్లడించింది. అక్టోబరు 22 నుంచి భారత్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. మరో వారం రోజుల్లో న్యూజిలాండ్ జట్టును ప్రకటించే అవకాశం ఉంది. రాబోయే ఆరు నెలల్లో కీలక టెస్టు సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో రచిన్‌ను తొందరగా బరిలోకి దించబోమని ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ స్పష్టం చేశారు. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే పోటీ క్రికెట్‌లోకి తీసుకురావాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. వైట్‌బాల్ క్రికెట్‌లో న్యూజిలాండ్‌కు కీలక ఆటగాడిగా మారిన రచిన్ రవీంద్ర ఇప్పటివరకు 52 టీ20 మ్యాచ్‌ల్లో 759 పరుగులు చేయడంతో పాటు 26 వికెట్లు సాధించాడు. అతడు అందుబాటులో లేకపోతే మిచెల్ శాంట్నర్‌పై అదనపు బాధ్యతలు పడే అవకాశం ఉంది.

# రోహిత్, కోహ్లీ నుంచి పరుగులే ఆశిస్తున్నాం




## ఆకాశ్ చోప్రా

న్యూఢిల్లీ సెప్టెంబరు 19 :
2027 వన్డే ప్రపంచకప్‌కు మరో ఏడాది మాత్రమే సమయం ఉన్నందున, సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల నుంచి ప్రధానంగా పరుగులు మాత్రమే ఆశిస్తున్నామని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు. వెస్టిండీస్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు రోహిత్, కోహ్లీ ఇద్దరూ ఎంపికైన నేపథ్యంలో ఆకాశ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. వీరు ఫామ్‌లో ఉంటే ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించగలరని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేసిన 15 మంది సభ్యుల భారత జట్టుపై చోప్రా సంతృప్తి వ్యక్తం చేశాడు. రిషబ్ పంత్ స్థానంలో రెండో వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురెల్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని కొనియాడాడు. హార్దిక్ పాండ్యా అందుబాటులో లేని సమయంలో నితీశ్ కుమార్ రెడ్డిని తీసుకోవడం జట్టుకు కలిసివస్తుందన్నాడు. ఇక ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌ల మధ్య తీవ్ర పోటీ ఉందని, 2027 ప్రపంచకప్ నాటికి ఈ ముగ్గురిలో ఒకరికే అవకాశం దక్కవచ్చని అంచనా వేశాడు. కాగా, భారత జట్టు సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో వెస్టిండీస్‌తో తొలి వన్డే ఆడనుంది. ఆ తర్వాత రెండవ మ్యాచ్ సెప్టెంబర్ 30న గువాహటిలో, మూడవ వన్డే అక్టోబర్ 3న చండీగఢ్‌లో జరగనున్నాయి.

# సంపాదకీయం

## లోతైన నైతిక ప్రశ్న!

భారత్ ఇప్పుడు సముద్రగర్భ సరిహద్దు గడప వద్ద ఉంది. ఆ సమయంలో ఉద్భవించే ప్రశ్న.. మనం ఎంత లోతుకు వెళ్లగలం, ఎంత తవ్వగలం, ఎంత సంపద తీసుకురాగలమన్నది కాదు, సముద్రగర్భంపై సరైన అవగాహన లేకుండా కదిలించాల్సిన అవసరముందా? అని. సముద్ర గర్భంలో ఏముందో మనకు ఇప్పటికీ పూర్తిగా తెలియదు. అలాంటిచోటుకు వెళ్లగలిగే సామర్థ్యాన్ని భారత్ ఇప్పుడు సాధిస్తున్న తరుణంలో.. కదిలించాల్సిన అవసరముందా? అన్నది ప్రాధాన్యత కలిగిన ప్రశ్నే.

సముద్రం అడుగున ఖనిజాన్వేషణ భారత్‌కు కొత్తేమీ కాదు. మధ్య హిందూ మహాసముద్రంలో సుమారు 75,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో తవ్వకాలు చేసేందుకు అంతర్జాతీయ సంస్థ నుంచి భారత్‌కు అనుమతి ఉంది. ఆ ప్రాంతంలో నికెల్, రాగి, కోబాల్ట్, మాంగనీస్‌లాంటి లోహాలతో కూడిన దాదాపు 380 మిలియన్ టన్నుల చిన్నచిన్న రాళ్లు ('నాడ్యూల్స్') ఉన్నట్టు అంచనా. వీటి విలువ సుమారు 110 బిలియన్ డాలర్లని అంచనా. ఇందులో కేవలం 10 శాతం వాడుకున్నా, భారత్ శక్తి అవసరాలు వందేళ్లపాటు తీరిపోతాయని ప్రభుత్వమే చెబుతోంది. ఇందుకోసం భారత్ 'మాత్స్య-6000' అనే ప్రత్యేక జలాంతర్గామిని తయారు చేస్తోంది. ఇందులో ముగ్గురు మనుషులు కూర్చుని సముద్రంలో 6,000 మీటర్ల లోతుకు వెళ్లగలరు. అంటే సముద్రపు అడుగుభాగంలో 95 శాతం భాగానికి చేరుకోగలరు. ఇప్పటికే 'వరాహ' అనే ఒక తవ్వకపు యంత్రాన్ని 5,270 మీటర్ల లోతులో విజయవంతంగా పరీక్షించారు. ఇదే సమయంలో, సముద్రంలో 19 కొండల చుట్టూ చేసిన అధ్యయనాల్లో దాదాపు 1,300 రకాల జీవులను గుర్తించారు. వాటిలో 23 రకాలు ప్రపంచానికే కొత్తగా బయటపడ్డాయి. అంటే, మనం ఇంకా తెలుసుకోని ఎన్నో జీవులు అక్కడ ఉన్నాయి. అలాంటి తరుణంలో, ఇప్పుడు మనం అక్కడ తవ్వకాలు చేపట్టాలా? వద్దా? అని ఆలోచించాల్సిన బాధ్యత భారత్‌పై లేకపోలేదు!

సముద్ర గర్భానికి చేరగల సామర్థ్యం సాధించాం కనుక.. అక్కడ తవ్వకాలు చేపట్టాల్సిందేనని అనుకోవడం ప్రమాదకరమైన ఆలోచన. సముద్రం విషయంలో మరింత లోతైన ఆలోచన చేయకతప్పదు. ఎందుకంటే సముద్రం అడుగుభాగం ఇంకా మనకు పూర్తిగా తెలియని ప్రపంచం. అక్కడ కొత్త జీవులు దొరుకుతూనే ఉండటమే అందుకు నిదర్శనం! అలాంటి చోట పెద్దఎత్తున తవ్వకాలు జరిపితే ఏమవుతుందో మనం ఖచ్చితంగా చెప్పలేం. దీని అర్థం శాస్త్రాన్ని వ్యతిరేకించమని కాదు, ఏదైనా తిరిగి సరిచేయలేని పని చేసేముందు, మరింత అధ్యయనం చేయాలని మాత్రమే. విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలకు ఈ ఖనిజాలు నిజంగానే అవసరం కావచ్చు. కానీ 'అవసరం' అనే మాట, 'తవ్వేయడానికి అనుమతి' అని కాదు. తవ్వకాలు మొదలుపెట్టే ముందు కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. ఈ ఖనిజాలు నిజంగా ఇంత పెద్ద మొత్తంలో అవసరమా? వేరే మార్గాలు ఏమైనా ఉన్నాయా? పాత వస్తువులను రీసైకిల్ చేయడం ద్వారా, తక్కువ వాడకం ద్వారా ఈ అవసరాన్ని తగ్గించుకోగలమా? అవసరం ఉందని ముందే అనుకోవడం కాదు, దాన్ని నిరూపించుకోవాలి. సముద్రం గురించి పరిశోధన చేయడం అంటే, తప్పకుండా తవ్వకాలు చేయాలని కాదు, కేవలం అధ్యయనం చేయడం వల్ల జ్ఞానం పెరుగుతుంది. అక్కడి జీవులు, పరిస్థితుల గురించి తెలుస్తుంది. దీనికి తవ్వకాలే అవసరం లేదు. కానీ తవ్వకాలు మొదలుపెడితే మాత్రం, సముద్రం అడుగుభాగం దెబ్బతింటుంది. కాబట్టి, "తక్కువ నష్టంతో ఎలా తవ్వాలి?" అని ఆలోచించే బదులు, "మనం అసలు తవ్వాలా?" అని మొదట ప్రశ్నించుకోవాలి. ఇప్పటివరకూ భారత్ కేవలం అన్వేషణ దశలోనే ఉంది కాబట్టి, భవిష్యత్తులో తవ్వకాలపై నిర్ణయం తీసుకునే ముందు కఠినమైన నియమాలు పెట్టుకోవడానికి ఇదే సరైన సమయం.

సముద్రం అడుగుభాగం ఇప్పుడు ఆర్థిక వృద్ధికి కొత్త మార్గంగా మారుతోంది. అయితే ఒకవైపు వాతావరణాన్ని కాపాడాలని, జీవులను రక్షించాలని కోరుకుంటూనే, మరోవైపు అక్కడ పరిశ్రమలు నడపాలని అనుకోవడం సరైనది కాదు. మనం వాడేసిన వస్తువుల వల్ల కలిగే నష్టాన్ని సముద్రంలోకి నెట్టేసే స్థలంగా అది మారకూడదు. ఏదైనా వస్తువును వాడుకోవడానికి వీలుగా మార్చేసి, దాన్ని 'మంచి పద్ధతి' అని పిలవడం సరైనది కాదు. నిజమైన అభివృద్ధి అంటే, తక్కువ వాడటం, పాత వస్తువులను మళ్లీ వాడుకోవడం, కొత్త మార్గాలు వెతకడం ద్వారా ప్రకృతిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం. ఇదే భారత్ ప్రకటించిన 'మిషన్ లైఫ్' లక్ష్యం కూడా. కాబట్టి శాస్త్రం మనకు వనరులను జాగ్రత్తగా వాడటం నేర్పించాలి, అంతేకాక వాటిని అస్సలు వాడాల్సిన అవసరం లేనప్పుడు కూడా అది తెలియజేయాలి. శాస్త్రం అంటే కొత్త ప్రదేశాలను తవ్వకానికి తెరవడం మాత్రమే కాదు, ఏ ప్రదేశాలను తాకకుండా వదిలేయాలో చెప్పడం కూడా శాస్త్రం పనే. "మనం అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదు" అని చెప్పగలగడం, "మనం వెళ్లగలం" అని నిరూపించడం కంటే గొప్ప విషయం.

ఈ విషయంలో ప్రపంచానికి ఒక మంచి ఉదాహరణగా భారత్ నిలవగలదు. సముద్రాన్ని కేవలం ఖనిజాల నిల్వగా కాకుండా, దాని సంపద కంటే విలువైన ప్రకృతి సంపదగా గుర్తించే ధైర్యం చేయగలదు. అధ్యయనం ద్వారా వచ్చిన జ్ఞానంతో, కొన్ని ప్రాంతాలను ముట్టుకోకుండా వదిలేయడమే మంచిదని నిర్ణయించుకోవచ్చు. అభివృద్ధి అంటే ప్రకృతిని ఎంత ఎక్కువగా వాడుకోగలమన్నది కాదు, మన అవసరాలు తీర్చుకుంటూనే, ప్రకృతిని ఎంతగా కాపాడుకోగలమన్నదే నిజమైన కొలమానం. ఇది ప్రకృతితో కలిసి జీవించే భారత సంప్రదాయాన్ని మరోసారి నిరూపించే అవకాశం. ఈ నిర్ణయం ఇవాళ తీసుకోవడం వల్ల రేపటి తరాలకు ఒక సురక్షితమైన సముద్రం మిగులుతుంది. డబ్బు, వనరుల కోసం ప్రతి మూలనూ తవ్వేయాల్సిన అవసరం లేదని ప్రపంచానికి చూపించే అవకాశం భారత్‌కు దక్కుతుంది. శాస్త్రం అభివృద్ధి చెందిన ప్రతిసారీ, దాన్ని డబ్బు సంపాదనకే వాడాలని లేదు, కొన్నిసార్లు, ఏం చేయకుండా ఉండటమే నిజమైన తెలివి. సముద్రం మనకు ఆహారం, వాతావరణ సమతుల్యత, ప్రాణవాయువు లాంటివి ఉచితంగా ఇస్తోంది. దాన్ని కొన్ని ఖనిజాల కోసం పాడుచేసుకుంటే, ఆ నష్టం డబ్బుతో కొలవలేనిది. అందుకే, ఇప్పుడు వేసే ప్రతి అడుగూ చాలా జాగ్రత్తగా, ఆలోచించి వేయాలి. చివరిగా చెప్పాలంటే -మనం ఎంత సాధించగలమన్నది కాదు, ఎంత సంరక్షించగలమన్నదే అసలైన విజయం!

## పనికొచ్చే పలుకు



# ఇప్పుడిక.. 'టెస్ట్‌ట్యూబ్'లవైపు

**ఏఐ ఇప్పుడు కోడ్‌నే కాదు, కణాలనూ కదిలిస్తోంది! చాట్‌బాట్‌ల నుంచి టెస్ట్ ట్యూబ్‌ల దాకా సాగిన ఆంత్రోపిక్ ప్రయాణం, నిశ్శబ్దంగానే ఒక కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టింది. అరుదైన వ్యాధులకు చికిత్స అన్వేషణలో భాగమని చెబుతున్నా, గోప్యత మాత్రం ప్రశ్నలను రేకెత్తిస్తోంది. టెక్నాలజీ ఇప్పుడు తెరలు దాటి, జీవశాస్త్రపు లోతుల్లోకి అడుగుపెడుతోంది.**

ఇప్పటివరకూ చాట్‌బాట్‌లు, కోడింగ్ టూల్స్‌కే పరిమితమైన కృత్రిమ మేధ (ఏఐ) రంగం ఇప్పుడు ప్రయోగశాలల్లోకి అడుగుపెడుతోంది. ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్, శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో ఒక 'వెట్ ల్యాబ్'ను -అంటే భౌతిక జీవశాస్త్ర ప్రయోగాలు జరిపే ప్రయోగశాలను నిశ్శబ్దంగా ఏర్పాటు చేసినట్టు రాయిటర్స్ కథనం వెల్లడించింది. ఇప్పటివరకూ కంప్యూటర్‌లోనే ('ఇన్ సిలికో') జరిపే జీవశాస్త్ర పరిశోధనలకు భిన్నంగా, ఇకపై నిజమైన ప్రయోగాలు కూడా చేయనున్నట్టు కంపెనీ హెడ్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఎరిక్ కౌడరర్-అబ్రామ్స్ ధృవీకరించారు. "జీవశాస్త్రంలో అసలైన పరీక్ష ఎప్పటికీ నిజమైన ప్రయోగశాల పనిలోనే ఉంటుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు.

అరుదైన వ్యాధులకు చికిత్సలు కనుక్కోవాలన్నదే తమ లక్ష్యమని కంపెనీ చెబుతున్నప్పటికీ, ఈ ల్యాబ్ నిర్దిష్టంగా 'డ్రగ్ డిస్కవరీ' కోసం కాదని ఒక ప్రతినిధి స్పష్టం చేశారు, అయితే అంతకుమించి వివరాలు వెల్లడించలేదు. ల్యాబ్ పరిమాణం, సిబ్బంది సంఖ్య, భద్రతాస్థాయి వంటి కీలక వివరాలేవీ కంపెనీ బహిర్గతం చేయలేదు. ఈ గోప్యతే అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ముఖ్యంగా, తమ ఏఐ మోడళ్లు జీవాయుధాల తయారీకి దుర్వినియోగం కావచ్చని పదేపదే హెచ్చరించే అదే కంపెనీ, స్వయంగా జీవశాస్త్ర ప్రయోగశాలను నడపడం ఒక వైరుధ్యంగా కనిపిస్తోంది.

ఇది ఒక్క ఆంత్రోపిక్‌కే పరిమితమైన పరిణామం కాదు. నొవార్టిస్ మాజీ సీఈఓను తన బోర్డులో చేర్చుకోవడం, సుమారు 400 మిలియన్ డాలర్లకు 'కోఎఫిషియంట్ బయో' అనే స్టార్టప్‌ను కొనుగోలు చేయడం, 60కి పైగా శాస్త్రీయ డేటాబేస్‌లతో అనుసంధానమైన 'క్లాడ్ సైన్స్' అనే వర్క్‌బెంచ్‌ను ప్రారంభించడం వంటివి చూస్తే, ఇది జీవశాస్త్ర రంగంలోకి ఏఐ కంపెనీల భారీ ప్రవేశానికి సంకేతంగా కనిపిస్తోంది. సంప్రదాయ ఔషధ కంపెనీలు ఆర్థికంగా లాభసాటి కానందున వదిలేసిన అరుదైన వ్యాధుల పరిశోధనపై దృష్టి పెడతామని కంపెనీ చెబుతున్నా, భారీ కంప్యూటింగ్ శక్తి, డేటా వెనుక ఉన్న ఏఐ దిగ్గజాలు ఇప్పుడు ఔషధ రంగంలోకి కూడా విస్తరించడం పరిశ్రమ దృక్కోణాన్నే మారుస్తోంది. ఏఐ సామర్థ్యాలు కంప్యూటర్ తెరలు దాటి, నిజమైన జీవకణాల దాకా చేరుకుంటున్న ఈ పరిణామం, భవిష్యత్తులో ఔషధ పరిశోధన వేగాన్ని పెంచవచ్చు లేదా కొత్త నైతిక, భద్రతా సవాళ్లను తీసుకురావచ్చు.. రెండు అవకాశాలూ సమానంగా ఉన్నాయి.

# అమలుతోనే అసలు విజయం!




**క్వాంటమ్ నుంచి క్వాలిటీ ఉద్యోగాల దాకా, పెట్టుబడుల జాబితా అమరావతిలో మరింత పొడవుగా పెరుగుతోంది. కాగితాలపై కోట్లు, గణాంకాల్లో లక్షల ఉద్యోగాలు కనిపిస్తున్నా, అసలైన ప్రశ్న ఇంకా మిగిలే ఉంది - ఇవి ఎప్పుడు నేలపైకి వస్తాయి? ఆమోదాల ప్రకటనలతో ఆగిపోకుండా, గడువులోగా గ్రౌండ్ అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రభుత్వానిదే. హామీలు నిజమైతేనే, ఈ పెట్టుబడుల పరుగుకు అర్థం ఉంటుంది.**

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ప్రవాహం వార్తల్లో ఉంటూనే ఉంది. తాజాగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎసఐపీబీ) సమావేశంలో మొత్తం 28 పారిశ్రామిక ప్రతిపాదనలకు రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా 19,739 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఐటీ మంత్రి నారా లోకేష్ చొరవతో రూ.526.25 కోట్ల పెట్టుబడితో పది ఐటీ ప్రాజెక్టులకు ప్రత్యేకంగా ఆమోదం లభించింది. వీటి ద్వారా 8,896 ఉద్యోగాలు లభించనున్నాయి. వీటిలో విశాఖపట్నంలో డెలాయిట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ కార్యకలాపాల విస్తరణ ఒకవైపు ఉండగా, అమరావతి కేంద్రంగా క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో ఆరు ప్రాజెక్టులకు ఆమోదం లభించడం మరో ముఖ్యాంశం. సృష్టి క్వాంటమ్, క్వాంటమ్ కోడాన్, ట్రైక్వాంటా ల్యాబ్స్, అరోహాక్ టెక్నాలజీస్, ఫోటాన్‌కోర్ సిస్టమ్స్, వెరిడేటా హెల్త్ వంటి సంస్థలు అమరావతిలో క్వాంటమ్ హార్డ్‌వేర్, నానో ఫ్యాబ్రికేషన్, ఏఐ-ఆధారిత బయోటెక్నాలజీ, ఫోటోనిక్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టనున్నాయి. ఇది కేవలం ఒక్కసారి జరిగిన పరిణామం కాదు.. ఇప్పటివరకూ జరిగిన 21 ఎస్ఐపీబీ సమావేశాల్లో మొత్తం 387 ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, వీటి ద్వారా రూ.14.05 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.79 లక్షలమందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతోంది. తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతూ ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ తయారీ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయాలన్న ఆలోచన, కొప్పర్తి-తిరుపతి-లేపాక్షి ఎలక్ట్రానిక్స్ హబ్‌లను విస్తరించాలన్న ప్రణాళిక, రేర్ ఎర్త్ మినరల్స్ ప్రాసెసింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న యోచన -ఇవన్నీ ఏపీని భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞాన కేంద్రంగా నిలబెట్టాలన్న విస్తృత వ్యూహంలో భాగంగా కనిపిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌లాంటి అత్యంత అధునాతన, ప్రయోగాత్మక దశలో ఉన్న రంగంలో దేశంలోనే మొట్టమొదటి హైబ్రిడ్ క్వాంటమ్ కంప్యూటింగ్ హార్డ్‌వేర్ తయారీని అమరావతిలో చేపట్టనున్నట్టు ప్రకటించడం, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తోంది.

అయితే, ఈ గణాంకాలను చూసినప్పుడు ఒక ప్రాథమిక వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. ఎస్ఐపీబీ ఆమోదం అంటే పెట్టుబడి వాస్తవంగా వచ్చేసినట్టు కాదు, కేవలం ఒక ప్రతిపాదనకు ప్రభుత్వ అనుమతి లభించడం మాత్రమే. రూ.14.05 లక్షల కోట్ల మొత్తం పెట్టుబడుల ప్రకటన, 10.79 లక్షల ఉద్యోగాల వాగ్దానం భారీ సంఖ్యలే అయినప్పటికీ, వీటిలో ఎంతశాతం వాస్తవంగా భూమిపైకి వచ్చాయి, ఎన్ని యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి, ఎంతమందికి నిజంగా ఉద్యోగాలు లభించాయి అనే లెక్క వేరుగా ఉంటుంది. దేశంలో ఏ రాష్ట్రంలో అయినా పెట్టుబడుల ఆకర్షణ సదస్సులు, ఎంవోయూలు, బోర్డు ఆమోదాలు హడావుడిగా జరగడం సర్వసాధారణమే. కానీ వాటిలో ఎంతశాతం చివరకు కర్మాగారాలుగా మారి, పొగగొట్టాలు వెలిగించాయన్నదే అసలైన కొలమానం. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పరోక్షంగా అంగీకరించినట్టు కనిపిస్తుంది. ప్రతి ప్రాజెక్టుకు ఆరు నెలల గడువు విధించి, ఆ వ్యవధిలోగా పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించడం, ఆమోదం పొందడం ఒక్కటే సరిపోదని, గ్రౌండ్ కావడం అసలైన సవాలని ప్రభుత్వమే గుర్తించినట్టు స్పష్టం చేస్తుంది. అలాగే, నవంబర్‌లో జరగనున్న భాగస్వామ్య సదస్సు (పార్ట్‌నర్‌షిప్ సమిట్)కు కేవలం 50 రోజుల సమయమే మిగిలి ఉందని, అప్పటికల్లా గతంలో కుదిరిన ఒప్పందాలు వాస్తవరూపం దాల్చాలని సీఎం అధికారులకు గుర్తుచేయడం కూడా, గత ప్రకటనల్లో గ్రౌండింగ్ ఆలస్యమవుతున్న వాస్తవాన్ని పరోక్షంగా అంగీకరించడమే.

క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులు రావడం సాంకేతికంగా గర్వకారణమే అయినా, ఇవి ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉన్న, ప్రపంచవ్యాప్తంగా కూడా వాణిజ్యపరంగా పూర్తిగా స్థిరపడని రంగాలు. కేవలం రూ.9 కోట్లనుంచి రూ.2,700 కోట్ల వరకూ విభిన్న స్థాయిల్లో ఉన్న ఈ క్వాంటమ్ ప్రాజెక్టులు, వాటి ప్రకటిత ఉద్యోగాల సంఖ్య (45నుంచి 3,000 దాకా) చూస్తే, వీటిలో కొన్ని ఇప్పటికే స్థిరపడిన సంస్థల విస్తరణలు కాగా, మరికొన్ని కొత్తగా ఏర్పడుతున్న చిన్న సంస్థల ప్రతిపాదనలు మాత్రమే. వీటిని ఒకే గాటన కట్టి భారీ విజయంగా చిత్రీకరించే బదులు, ఏవి వాస్తవానికి దగ్గరగా ఉన్నాయో, ఏవి కేవలం ఆకాంక్షాత్మక ప్రకటనలో అనే విభజన చేయడం ప్రభుత్వ విశ్వసనీయతకు మేలు చేస్తుంది.

మంత్రి నారా లోకేష్ ఐటీ, భవిష్యత్ సాంకేతిక రంగాల్లో చూపిస్తున్న చొరవను తక్కువ చేయలేం. దేశ, విదేశీ కంపెనీలను రాష్ట్రానికి రప్పించే ప్రయత్నాలు, తైవాన్‌తో సంప్రదింపులు, స్కిల్ మ్యాపింగ్ ద్వారా యువతను సన్నద్ధం చేసే ఆలోచన హర్షణీయమైనవే. అయితే, పెట్టుబడులు ఆకర్షించడం అనేది యుద్ధంలో సగం మాత్రమే -మిగతా సగం, వాటిని వాస్తవరూపంలోకి తీసుకురావడంలోనే ఉంది. భూసేకరణ ఆలస్యాలు, అనుమతుల జాప్యం, విద్యుత్-నీటి వసతుల కొరత, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి లభ్యత వంటి ఆచరణాత్మక అడ్డంకులు ఎదురైతే, ఎంత భారీ ప్రకటన అయినా కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదముంటుంది. అందుకే, ప్రతి ప్రాజెక్టుకు నిర్దేశించిన ఆరు నెలల గడువును ప్రభుత్వం నిజాయితీగా అమలు చేసి, ఏ ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయో, ఎందుకు ఆలస్యమవుతున్నాయో పారదర్శకంగా బహిర్గతం చేయాలి. కేవలం కొత్త ఎంవోయూలు, కొత్త ఆమోదాల ప్రకటనలతో సరిపెట్టుకోకుండా, ఇప్పటికే ఆమోదం పొందిన 387 ప్రాజెక్టుల్లో ఎన్ని వాస్తవంగా ఉత్పత్తిని ప్రారంభించాయో, ఎంతమందికి నిజంగా ఉద్యోగాలు లభించాయో కాలానుగుణంగా లెక్క తేల్చి ప్రజల ముందు ఉంచడం అవసరం. అప్పుడే ఈ పెట్టుబడుల ప్రవాహం కేవలం ప్రచార వాక్యాలకే పరిమితం కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను, యువత భవిష్యత్తును నిజంగా మార్చే శక్తిగా నిలుస్తుంది. సాధించడం ఒక్కటే విజయం కాదు.. సాధించినదాన్ని నేలపైకి తీసుకురావడమే అసలైన విజయం! ■




**చాలామంది ఉద్యోగం, పిల్లల పెంపకం, ఆరోగ్యం విషయంలో ఎంతో బాధ్యతగా ఉంటారు. కానీ ఆలోచనల విషయానికి వచ్చేసరికి క్రమశిక్షణ కోల్పోతారు. ప్రతి ప్రతికూల ఆలోచననూ లోపలికి అనుమతించి భయం, ఆందోళనతో జీవిస్తుంటారు. అలాకాకుండా, మీ ఆలోచనలపట్ల కూడా బాధ్యతగా ఉండండి. మిమ్మల్ని వెనక్కి లాగే, భయపెట్టే ఆలోచనలకు మనసులో చోటు ఇవ్వకండి. మీ శరీరానికి ఏది మంచిదో ఏది కాదో జాగ్రత్తగా ఎంచుకున్నట్టే, మీ మనసులోకి ఏ ఆలోచన రావాలో కూడా మీరే నిర్ణయించుకోవాలి. ఆలోచనలపై నియంత్రణ సాధించినవాడే, జీవితంపై నిజమైన నియంత్రణ సాధించినవాడు.**

-మహాదేవ

## వింతల్లో వింతలు

# కతార్ 'బేబీ జెయింట్'



13 ఏళ్ల వయసు... 6 అడుగుల 11 అంగుళాల ఎత్తు! ఇది సినిమా కథ కాదు, ఆసియా వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో నిజంగా జరిగిన విషయం. కతార్ జట్టుకు చెందిన మొబారక్ మూసా థీక్ మదుత్ అనే బాలుడు, మూడు మ్యాచ్‌ల్లో ఏకంగా 40 పాయింట్లు కొట్టి, తన సీనియర్ సహచరులనే వెనక్కి నెట్టేశాడు. వయసు 13 అని అధికారికంగా చెప్పుకున్నా, ఆటతీరు మాత్రం అనుభవజ్ఞుడైన ప్రొఫెషనల్‌ను తలపిస్తోందని ఆటగాళ్లే ఆశ్చర్యపోతున్నారు.


దక్షిణ సూడాన్‌లో పుట్టి, తర్వాత కతార్ పౌరసత్వం పొందిన ఇతడి అసలు వయసుపైనే నెటిజన్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వయసు ఎంతైనా, ఎత్తు మాత్రం అబద్ధం చెప్పదు కదా!



## నాని 'ది ప్యారడైజ్' సినిమాలో 'పొడుస్తున్న పొద్దుమీద'?

నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మాస్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్'. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేయగా, తాజాగా మ్యూజికల్ ఫీస్ట్‌కు సంబంధించిన ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతంలో రాబోతున్న పాటల జాబితా నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ ఉద్యమ గీతంగా కోట్లాది మంది ప్రజల హృదయాలను హత్తుకున్న ప్రసిద్ధ ప్రజా యుద్ధ నౌక గద్దర్ అమూల్యమైన గీతం 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా...' పాటను ఈ సినిమాలో ఉపయోగిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే 'ఆయా షేర్', 'ఏష నాగుల' పాటలతో పాటు ఈ ఐకానిక్ ఫోక్ సాంగ్ కూడా సినిమాలో చోటు చేసుకుంటే, థియేటర్లలో ప్రేక్షకుల ఊపు చూసి థియేటర్లు ఊగిపోవడం ఖాయమని సినీ వర్గాలు అంటున్నాయి. అనిరుధ్ మ్యూజిక్, శ్రీకాంత్ ఓదెల టేకింగ్, నాని మాస్ పెర్ఫార్మెన్స్‌కు తోడు ఈ ఫోక్ సాంగ్ తాలుక వైబ్స్ తోడైతే సిల్వర్ స్క్రీన్ మీద రికార్డులు తిరగరాయడం పక్కా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై చిత్రయూనిట్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇవి కేవలం రుమర్స్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## రా అండ్ రస్టిక్‌గా ఆశిష్ గాంధీ 'డానీ'.. అంచనాలు పెంచుతున్న ఫస్ట్ స్ట్రైక్ గ్లింప్స్!




టాలీవుడ్ ప్రేక్షకులను ఎంతగానో అలరించేందుకు మరో రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సిద్ధమవుతోంది. ఆశిష్ గాంధీ హీరోగా, కళ్యాణ్‌జీ గోగణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'డానీ'. రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ బ్యానర్లపై రిజ్వాన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన 'ఫస్ట్ స్ట్రైక్' టీజర్ తాజాగా విడుదల కాగా, సినిమాపై అంచనాలు ఒక్కసారిగా తారాస్థాయికి చేరాయి. టీజర్ ఆరంభంలోనే "నువ్వు బీచ్‌కి ఎప్పుడూ ఒంటరిగా వస్తావా?" అని హీరోయిన్ అడిగే ప్రశ్నకు, హీరో చెప్పే బోల్డ్ ఆన్సర్ యూత్ ఆడియెన్స్‌ను ఇన్‌స్టంట్‌గా కనెక్ట్ చేసేలా ఉంది. రొమాంటిక్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో కేవలం రొమాన్స్ మాత్రమే కాకుండా, థ్రిల్ గొలిపే యాక్షన్ సన్నివేశాలకు కూడా పెద్ద పీట వేసినట్లు స్పష్టమవుతోంది. బీచ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే విజువల్స్, నటీనటుల గ్లామర్ అప్పీల్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఇప్పటికే దర్శకుడు కళ్యాణ్‌జీ గోగణ, హీరో ఆశిష్ గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన 'నాటకం', 'కళింగ' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించాయి. ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ హ్యాట్రిక్ కొట్టడానికి 'డానీ'తో వస్తుండటంతో సినీ వర్గాల్లోనూ మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రంలో సేజల్ గుప్తా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టెక్నికల్ పరంగా కూడా 'డానీ' ఫస్ట్ స్ట్రైక్ అత్యున్నత ప్రమాణాలతో నిలిచింది. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ చాలా రిచ్‌గా, కలర్ ఫుల్‌గా ఉంది. ఇక మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విజువల్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా బీజీఎం అదరగొట్టింది. ఖుషి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి మణికాంత్ ఎడిటర్‌గా, రామ్ సుంకర, కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రాఫర్లుగా వర్క్ చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను మేకర్స్ విడుదల చేయనున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి అక్టోబర్ నెలలో ఈ సినిమాను గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. రా అండ్ రస్టిక్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ 'డానీ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి!




# విజయ్ వారసుడి అరంగేట్రం.. 'సిగ్మా' ట్రైలర్‌తో అదరగొట్టిన జేసన్ సంజయ్, సందీప్ కిషన్!

తమిళనాడు సీఎం స్టార్ హీరో దళపతి విజయ్ వారసుడిగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్న జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ హై-ఆక్టేన్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ట్రైలర్ చూస్తే.. ఇది పూర్తిగా గ్యాంబ్లింగ్, డ్రగ్స్ మరియు ఒక మనీ హైస్ట్ నేపథ్యంలో సాగే రంగుల ప్రపంచం చుట్టూ తిరిగే పర్ఫెక్ట్ యాక్షన్ డ్రామాగా రూపొందినట్లు స్పష్టమవుతోంది. ఇందులో సందీప్ కిషన్ ఒక వైవిధ్యమైన రేడియో జాకీ పాత్రలో కనిపిస్తూనే, మరోవైపు అండర్ వరల్డ్ డాన్‌గా చెలరేగుతున్న సంపత్ రాజ్ సామ్రాజ్యాన్ని దెబ్బకొట్టే సాహసోపేతమైన మిషన్‌లో కనిపించడం విశేషం. ట్రైలర్ అంతటా కనిపిస్తున్న విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, సంపత్ రాజ్, శివ్ పండిట్, ప్రముఖ కొరియోగ్రాఫర్-నటుడు రాజు సుందరం తదితరులు కీలక పాత్రల్లో తమ నటనతో మెప్పించనున్నారు. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ 'లైకా ప్రొడక్షన్స్' పతాకంపై సుభాస్కరన్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందిస్తున్న బాణీలు, నేపథ్య సంగీతం ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మొత్తానికి, అన్ని హంగులను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మహాత్మా గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2, 2026 న తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూట్యూబ్ తో పాటు అన్ని సోషల్ మీడియా వేదికలపై టాప్ ట్రెండింగ్‌లో దూసుకుపోతూ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# హాలీవుడ్‌లో నటించాలని ఉంది.. ఆ సినిమాలో నాకు ఛాన్స్ ఇవ్వండి: విజయ్ సేతుపతి

టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా తన విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి తన కెరీర్ మరియు రాబోయే ప్రాజెక్ట్‌ల గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఇటీవల నిథిలన్ స్వామినాథన్ తనకు 'మహారాజా 2' కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని ఆయన వెల్లడించారు. నిథిలన్ ఒక అద్భుతమైన దర్శకుడని ప్రశంసించిన విజయ్ సేతుపతి, మొదటి భాగం 'మహారాజా' విడుదల కాకముందు కొందరు ఈ సినిమాపై నమ్మకం ఉంచలేదని, కానీ తాను మాత్రం సినిమా విజయం సాధిస్తుందని గట్టిగా నమ్మానని గుర్తుచేసుకున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా హాలీవుడ్ నుంచి ఓ భారీ ఆఫర్ రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్మాత తనకు ఫోన్ చేసి 'మహారాజా' సినిమాను హాలీవుడ్‌కు అమ్మేశామని చెప్పారని, ఆ చిత్రంలో హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కానగీ నటించబోతున్నారని తెలిపారన్నారు. ఈ విషయం విన్న వెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని, నిర్మాతతో మాట్లాడుతూ 'ఒక సినిమాలో నేను ఉచితంగా నటిస్తాను.. కానీ ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు కూడా ఒక చిన్న పాత్ర ఇప్పించండి.. నేను అక్కడికి వెళ్లి నటిస్తాను' అని సరదాగా అన్నట్లు విజయ్ సేతుపతి తెలిపారు. తనకు మొదటి నుంచీ హాలీవుడ్‌లో నటించాలనే బలమైన కోరిక ఉందని, తన సినిమా అక్కడకు చేరుకోవడం తనకు ఎంతో ఆనందాన్నిస్తోందని ఆయన మనసులోని మాటలను బయటపెట్టారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com